# ప్రభాత సమాచారం

https: epaper.
prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ బుధవారం | 28 మే 2025 | ■ 14 పేజీలు




14

## తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన కలెక్టర్



11

# విస్తరిస్తున్న నైరుతి జోరు వాన



ఇచ్చోడలో..

■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

■ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షాలు ■ రుతుపవనాలకు తోడు బంగాళాఖాతంలో ఆవర్తనం ■ కాలనీలు జలమయం

■ ఇండ్లు, వ్యాపార సముదాయాల్లోకి వర్షం నీరు ■ ఉప్పొంగిన ఎర్రవాగు.. ఆరు గ్రామాలకు నిలిచిన రాకపోకలు

■ కొనుగోలు కేంద్రాల్లో మళ్లీ తడిసిన ధాన్యం ■ రైతులకు తప్పని తిప్పలు ■ మరో రెండు రోజులు ఇదే పరిస్థితి

నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయి. మరోవైపు అల్పపీడనం సైతం కొనసా గుతోంది. వీటి ప్రభావంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన వాన మొదలైంది. గంటన్నర పాటు ఏకధాటిగా కురవడంతో పట్టణంలోని రోడ్లన్నీ జలమయయ్యాయి. రహదారులపై భారీగా వర్షపు నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. పలు కాలనీలో వరదనీరు ఇళ్లలోకి చేరింది. ఇంద్రవెల్లి, గాదిగూడ మండలాల్లో కురిసిన వర్షానికి ఇంటిపైకప్పులు లేచిపోయాయి. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొన్ని చోట్ల చెట్లు విరిగిపడగా, స్తంభాలు నెలకొరిగాయి. పొల్లుగూడలోని పెర్సపేన్ ఆలయంపై పిడుగు పడింది. అలాగే జొన్నల కొనుగోలు కేంద్రాల్లో విక్రయానికి తీసుకు వచ్చిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కాగా మరో రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ ప్రకటించింది.



14

### సమీకృత గురుకులం

## విద్యాభివృద్ధికి సోపానం

■ ఖానాపూర్ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు..

■ రూ.200కోట్లతో స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణం

■ రాష్ట్రంలోని 20 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పాఠశాలల నిర్మాణనికి ఓకే చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం..

■ రూ.4,000 కోట్లతో ప్రతిపాదనలకు మంజూరి జారీ..

■ ఒక్కో పాఠశాలకు రూ.200కోట్ల చొప్పున కేటాయింపు

పేద, మధ్య తరగతి విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటులో భాగంగా నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గానికి అవకాశం లభించింది. ఇప్పటికే మొదటి విడతగా రాష్ట్ర వ్యాప్తంగా పలు ఇంటిగ్రేటెడ్ రె సిడెన్షియల్ స్కూల్ మంజూరు చేసి భవన నిర్మాణ పనులను గత నెలలో ప్రభుత్వం ప్రారంభించింది. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చేసిన ప్రయత్నం మేరకు సీఎం రేవంత్ రెడ్డి ఖానాపూర్‌కు పాఠశాలను మంజూరు చేశారు. విద్య, మౌలిక సదుపాయాలను పెంపొందించడానికి 20 అసెంబ్లీ నియోజకవర్గాలలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్‌లను నిర్మించడానికి రూ.4.000 కోట్లతో ప్రతిపాదనలకు పరిపాలన అనుమతి ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.



10

■ నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు

■ మొదటి విడతలో ఇళ్లు లేని నిరుపేదలకే అవకాశం..

■ పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ

■ బ్రాహ్మణగావ్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు చర్యలు

■ ఆదివాసీలు ఐక్యంగా ఉండాలి..

■ లోకేశ్వరం మండలంలో కుమ్రంభీం విగ్రహావిష్కరణ

■ జిల్లా ఇంచార్జీ మంత్రి సీతక్క

### పేదల సొంతింటి కల

## నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

ఇండ్లు లేని నిరుపేదలందరికీ సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ సీతక్క స్పష్టం చేశారు. మంగళవారం ముధోల్ మండలం బ్రాహ్మణగావ్‌లో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభోత్సవం, పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనల కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం లోకేశ్వరం మండలంలో ఏర్పాటు చేసిన కుమ్రంభీం ఆవిగ్రహాన్ని ఆవిష్కరించారు.

## విధుల్లో నిర్లక్ష్యం చేయొద్దు..

■ కలెక్టర్లు విధుల్లో యాక్టివ్‌గా ఉండాలి

■ ప్రభుత్వ పథకాలు అర్హులైన వారందరికీ అందాలి

■ వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోలు వేగం చేయాలి

■ వీడియోకాన్ఫరెన్సులో కలెక్టర్లకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం



13

### బుల్లెట్ బండి చప్పుడు..

## చేస్తే బెండు తీస్తరు

■ మాడిఫైడ్ సైలెన్సర్ పెడితే కేసుల నమోదు

■ సౌండ్ పొల్యూషన్ సైలెన్సర్‌లు వాడితే చర్యలు..

■ ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరిక

### నకిలీ విత్తనాలు

## విక్రయిస్తే కఠిన చర్యలు

■ రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలి

■ ఖానాపూర్ ఎమ్మెల్యే ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

మార్కెట్‌లో నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని, శాస్త్రవేతల సలహాలతో పంటలు సాగు చేయాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సూచించారు. మంగళవారం ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ గ్రామంలోని రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేతలు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

వివరాలు 14లో





## చినుకు పడితే చిత్తడే
# ప్రయాణికులకు తప్పని తిప్పలు





**ఇచ్చోడ, మే 27 (ప్రభాత సమాచారం)**

వర్షాకాలం ప్రారంభంకానుండడంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు రోడ్లు సరిగా లేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షకాలంలో రైతులు వ్యవపాయం పనుల కోసం రోజు మండల కేంద్రాలకు వెళ్లాల్సి ఉంటుంది. తమకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను కొనుగోలు, ఇతర పనుల కోసం మండల, జిల్లా కేంద్రాలకు వస్తారు. విద్యార్థులు రోజు పాఠశాల, కళాశాలలకు బస్సులు, ఇతర వాహనాల్లో ప్రయాణం చేస్తారు. ఆయా గ్రామాల ప్రజలు ఆరోగ్య సమస్యలు, రేషన్ సరుకులు పలు పనుల కోసం జిల్లా కేంద్రానికి వస్తారు. రహదారులు అస్తవ్యస్తంగా మారడంతో స్థానికులు ఇబ్బందులు తప్పేటట్లు లేవు. బజార్‌హత్నూర్ మండలంలోని ఇచ్చోడ-సోనాల ప్రధాన రహదారిపై ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. చినుకు పడితే చాలు రోడ్డు బురదమయం అవుతున్నది. ఆ బురదలో బైక్‌పై వెళ్లాలన్నా ప్రజలు భయపడుతున్నారు. ఇచ్చోడ- సోనాల ప్రధాన రహదారిపై కోలారి గ్రామ సమీపంలో వంతెన నిర్మాణం ఏండ్ల కొద్ది సాగుతున్నది. ప్రత్యామ్నాయంగా వేసిన రోడ్డు చినుకు పడితేచాలు చిత్తడిగా మరుతుండటంతో ప్రయాణికులకు నరక ప్రయంగా మారింది. మంగళవారం కురిసిన భారీ వర్షానికి రోడ్డు పూర్తిగా బురదమయం కావడంతో నిత్యం వందల సంఖ్యలో ప్రయానించే ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. ద్విచక్ర వాహనదారులు బురదలో నుంచి తమ బైక్‌లను అతి కష్టం మీద బయటకు తీస్తున్నారు. ఏడాది గడిచినా సదురు కాంట్రాక్టర్ వంతెన నిర్మాణం పూర్తి చేయడం లేదు. బ్రిడ్జి పరిధిలోని రోడ్డును మొరం వేసి అలాగే వదిలేయడంతో ఆ మార్గం గుండా వెళ్లాలంటేనే ప్రయాణికులు జంకుతున్నారు. కొద్దిపాటి వర్షానికే ఇలా ఉంటే వానాకాలంలో ప్రయాణికుల పరిస్థితి ఏంటని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికా రులు వంతెన నిర్మాణం దృష్టి సారించి సమస్యను తొందరగా పరిష్కరించాలని కోరుతున్నారు.



## భారీ వర్షాలకు ప్రజలు
# అప్రమత్తంగా ఉండాలి

### నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, మే 27 (ప్రభాత సమాచారం)**

భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. భారత వాతావరణ శాఖ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం రానున్న నాలుగు రోజులు ఉత్తర తెలంగాణా జిల్లాలలో ముఖ్యంగా నిర్మల్ జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు నదులు, వాగులు, వంకల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని కలెక్టర్ సూచించారు. విద్యుత్ తీగలు తెగినట్లయితే లేదా ఇతర ప్రమాదకర పరిస్థితులు ఏర్పడినపుడు వెంటనే సంబంధిత విద్యుత్ శాఖకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. అత్యవసర అవసరాల కోసం జిల్లా కంట్రోల్ రూమ్ నంబర్ 63056 46 600 ను సంప్రదించాలని, రైతులు తమ పంటలను సురక్షితంగా ఉంచేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాలు అధికంగా కురిసే ప్రాంతాల్లో రెవెన్యూ, పోలీస్, మునిసిపల్, పంచాయతీ, వ్యవసాయ శాఖల అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు.

# తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతుల ధర్నా



**సారంగాపూర్, మే 27 (ప్రభాత సమాచారం)**

అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని తరుగు తీయకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ సారంగాపూర్ మండలంలోని ధని గ్రామం వద్ద స్వర్ణ- నిర్మల్ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గతవారం రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడిసి మొలకెత్తిందని ఐకెపి సెంటర్ నిర్వాహకులు త్వరితగతిన కొనుగోలు చేయకపోవడంతో విక్రయానికి తీసుకువచ్చిన వరి ధాన్యం నీటి పాలవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే లారీల కొరత మూలంగా ధాన్యం రైస్ మిల్లులకు తరలించకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. కష్టపడి అప్పు సప్పుచేసి పంట పండిస్తే కొనుగోలు కేంద్రంలో సెంటర్ నిర్వాహకుల అలసత్వం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. రైతులు నష్టపోతే పంటకు చేసిన అప్పులు ఎలా తీరుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. తడిచిన ధాన్యాన్ని ఎలాంటి ఆంక్షలు లేకుండా ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గంటపాటు ధర్నా, రాస్తారోకో చేయడంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ధర్నా చేస్తున్నారన్న విషయం తెలియడంతో ఎస్సై శ్రీకాంత్ ధని గ్రామానికి చేరుకొని రైతులతో మాట్లాడి ధర్నాను శాంతింపచేశారు. నిర్వాహకులతో మాట్లాడి ధర్నాను విరమించారు.

# గ్రామీణులకు మెరుగైన సేవలు అందించాలి



**తాంసి, మే 27 (ప్రభాత సమాచారం)**

గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా నూతన పంచాయతీ అధికారి రమేష్ అన్నారు. నూతన పంచాయతీ అధికారిగా సోమవారం బాధ్యతలు చేపట్టగా మంగళవారం తాంసి మండలంలోని హస్నాపూర్, పొన్నారి, కప్పర్ల గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా పారిశుధ్య పనులను, నర్సరీ,సెగ్రియేషన్ షెడ్,ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రానికి వచ్చిన ఆయనకు ఎంపీడీవో కార్యలయంలో పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్ రెడ్డి, ఎంపివో రామ లింగయ్య, పంచాయతీ కార్యదర్శులు గంగన్న, కార్తిక్, సంధ్య, లావణ్య రెడ్డి, నరేష్, హమీద్, విజయ కనక దుర్గ, సుమతి తదితరులు పాల్గొన్నారు.




## భూముల కొలతల్లో
# సర్వేయర్ల పాత్ర కీలకం

### ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, మే 27 (ప్రభాత సమాచారం)**

భూముల కొలతల్లో సర్వేయర్ల పాత్ర కీలకమని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం లైసెన్సుడ్ సర్వేయర్ల శిక్షణ కారయక్రమంలో ఆయన మాట్లాడారు. భూముల కొలతల్లో సర్వేయర్ల పాత్ర చాలా ముఖ్యమని, భూమి సరిహద్దులను గుర్తించడం, కొలతలను తీసుకోవడం, భూమి నమూనాలను తయారు చేయడం ద్వారా సర్వేయర్లు భూమిని సరిగ్గా ఉపయోగించుకోవడానికి, ప్లాన్ చేయడానికి సహాయపడతారు. భూములకు సంబంధించి శిక్షణలో అన్ని అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రత్యేకించి రెవెన్యూకు సంబంధించి గ్రామాలు, మండలాల అంతర్గత సరిహద్దుల నిర్ణయంలో అలాగే అంతర్గత సరిహద్దుల వివాదాల పరిష్కారానికి నిర్వహించే సర్వే విషయంలో సర్వేయర్లదే ముఖ్యపాత్ర అని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సర్వేయర్లకు అందించే శిక్షణ ఎంతో ముఖ్యమని, శిక్షణలో ప్రతి అంశాన్ని ఏకాగ్రతతో నేర్చుకోవాలని, చట్టంను సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. సర్వేయర్లు శిక్షణకు హాజరై జాగ్రత్తగా అన్ని అంశాలను క్షుణ్ణంగా విని అర్థం చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం శిక్షణకు వారికి సర్వే సామగ్రిని పంపిణీ చేశారు.



# అటవీ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు




**వేమనపల్లి, మే 27 (ప్రభాత సమాచారం)**

వేమనపల్లి మండలం చామనపల్లి గ్రామంలో నిరుపేద రైతులకు పట్టా పాస్‌బుక్‌లు ఉన్నప్పటికీ వారి భూములు అటవీ శాఖ భూములని అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని ఇది సరైంది కాదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ పేర్కొన్నారు. సోమవారం రాత్రి అటవీ శాఖ అధికారులపై నీల్వాయి ఎస్ఐ శ్యామ్‌పటేల్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కొయ్యల ఏమాజీ మాట్లాడుతూ చామనపల్లి గ్రామానికి చెందిన రైతులకు గత ప్రభుత్వాలు పట్టదారు పాసు పుస్తకాలు ఇచ్చినప్పటికీ ఆ భూములు అటవీ శాఖ భూములంటూ రైతులను సాగు చేయకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. 9 మంది దళిత రైతులపై అక్రమ కేసులు బనాయించి వేధిస్తున్నారని ఆరోపించారు. నిరుపేద దళిత రైతులను వేధిస్తున్న అటవీ శాఖ అధికారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పేద రైతుల పక్షాన బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో న్యాయ పోరాటం చేస్తామని పేర్కొన్నారు. గతంలో భీమిని, కన్నెపల్లి, నెన్నెల మండలాల్లోని పోడు రైతుల పక్షాన పోరాటం చేసి అర్హులైన రైతులకు 200 ఎకరాల భూమిని ఇప్పించానని తెలిపారు. చామనపల్లి రైతుల కోసం పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మున్నారాజాసిసోడియా, దుర్గం ఎల్లయ్య, బానయ్య, లింగయ్య, పర్వతాలు, మధుకర్, సతీష్, రాజయ్య, మల్లయ్య , కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

## మంచిర్యాల జిల్లా రైతుల ఖాతాలలో
# 238 కోట్ల రూపాయల జమ
### మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్





**మంచిర్యాల, మే 27 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి వరి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 345 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 320 కేంద్రాలు ద్వారా 23 వేల 348 మంది రైతుల వద్ద నుండి 1 లక్ష 62 వేల 870 టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసి సంబంధిత రైతుల ఖాతాలలో 238 కోట్ల 13 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు. రైతుల వద్ద నుండి పూర్తి స్థాయిలో నిబంధనల ప్రకారం వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసిన 140 కొనుగోలు కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన వరిధాన్యంను రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి కనీస మద్దతు ధర పొందాలని, సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు 500 రూపాయలు అదనపు బోనస్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రతి రోజు 1 వేయి 500 మంది సిబ్బంది, హమాలీలు యజ్ఞంలా పని చేస్తున్నారని, నిత్యం 4 వేల నుండి 8 వేల టన్నుల ధాన్యం కాంటా చేసి 358 లారీల ద్వారా 6 వేల నుండి 8 వేల టన్నుల ధాన్యం కరీంనగర్‌లోని 68 మిల్లులకు, పెద్దపల్లిలోని 110 మిల్లులకు, జిల్లాలోని 20 మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి రోజు దాదాపు 5 కోట్ల రూపాయల నుండి 8 కోట్ల రూపాయలు సంబంధిత రైతుల బ్యాంక్ ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతు ఆటోమెటిక్ యంత్రంతో శుభ్రం చేసి కొనుగోలు కేంద్రాల వద్దకు నిబంధనల ప్రకారం ధాన్యం తీసుకురావాలని, అకాల వర్షాల సమయంలో కేంద్రాలలో అందుబాటులో ఉన్న టార్పాలిన్లను వినియోగించుకోవాలని తెలిపారు. ధాన్యం కొలతలు పరీక్షించి గ్రేడ్-ఎ, సాధారణ రకాలను గుర్తించడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కొనుగోలు కేంద్రాలలో తాగునీరు, ఓ.ఆర్.ఎస్., గోనె సంచులు, టార్పాలిన్లు అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని, రైతులు కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు.



## లక్షెట్టిపేట సీఐగా రమణ మూర్తి

**లక్షెట్టిపేట, మే 27 (ప్రభాత సమాచారం)**

లక్షెట్టిపేట సీఐగా రమణ మూర్తి బదిలీపై రానున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ సీఐగా బాధ్యతలు నిర్వర్తించిన అల్లం నరేందర్ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హైదరాబాద్‌కు, హైదరాబాద్‌లోని ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కార్యాలయం నుంచి రమణ మూర్తిని లక్షెట్టిపేటకు బదిలీ చేసినట్లు ఐజీ చంద్రశేఖర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ నేపథ్యంలో ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన సీఐ అల్లం నరేందర్‌కు పోలీస్ సిబ్బంది మంగళవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. సీఐ నరేందర్ సేవలు మరువలేనివన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో
# అంతరాయం

**నిర్మల్, మే 27 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ పట్టణంలోని విశ్వనాథ్ పేట్ విద్యుత్ సబ్ స్టేషన్‌లో బుధవారం విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆపరేషన్ డిఈ నాగరాజు తెలిపారు. అగ్రికల్చర్ మార్కెట్ ఏరియా, మోచి గల్లీ, భుధవారపేట్, గాంధీ చౌక్, కబూతర్ కమాన్ బుధవార్ పేట్ బోయవాడ, రామ్ రాబాద్ వైయస్సార్ కాలనీ గాజులపేట్ తతర కాలనీలో సాయంత్రం ఐదు గంటల నుంచి ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని విద్యుత్ వినియోగాలు సహకరించాలని ఆయన కోరారు.

# పతకాలు సాధించిన విద్యార్థులకు సన్మానం



**బెల్లంపల్లి, మే 27 (ప్రభాత సమాచారం)**

సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలలో పతకాలు సాధించిన బెల్లంపల్లి విద్యార్థులను మంగళవారం సన్మానించారు. మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో జరిగిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలలో పతకాలు సాధించిన విద్యార్థులను స్థానిక తిలక్ స్టేడియంలో పలువురు వక్తలు అభినందించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా నైపుణ్యాన్ని పెంచుకొని అభివృద్ధి చెందాలని కోరారు. క్రీడల వల్ల క్రీడాకారుల్లో స్నేహ భావం పెంపొందుతుందన్నారు. గెలుపొందిన క్రీడాకారులను, కోచ్ సంతోష్ యాదవ్ ను ఆయన అభినందించారు. పతకాలు సాధించిన హన్సిత్, త్రీనైన్, లాహిత వర్మ, చాణక్య, ఈషాన్ వర్మ, చిన్మయి చైత్రిక, అక్షయ, పార్థు, కార్తికేయ, సుహాస్, ఎండి. సానియా, గౌసుద్దీన్, మనో రిత్విక్, డి.దీక్షిత్, లక్ష్మి సహస్ర, 24 మంది మెడల్స్ సాధించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు గెల్లి జయరాం, నగేష్ గోవర్ధన్, రాజన్న, సంతోష్, గణేష్ ఏకదంత మిత్రమండలి సభ్యులు శ్రీనివాస్, క్రీడాకారుల తల్లిదండ్రులు సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.




## వర్షం వస్తే నీరు.. వెలిస్తే దుమ్ము

- ఇచ్చోడలో భారీ వర్షానికి దుకాణాల్లోకి వర్షం నీరు..
- అవస్థలు పడుతున్న వ్యాపారులు, ప్రయాణికులు

**ఇచ్చోడ, మే 27 (ప్రభాత సమాచారం)**

ఇచ్చోడ మండల కేంద్రంలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. అధికారులు పర్యవేక్షణ లోపంతో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. ప్రధానంగా మండలంలోని ప్రధాన డ్రైనేజీలో పూడిక తీయకపోవడంతో రోడ్డుపై నుంచి డ్రైనేజీ నీరు వ్యాపార దుకాణాల్లోకి రావడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్డుపై డ్రైనేజీ నీరు కుంటను తలపిస్తోంది. రోడ్లపైకి నీళ్లు రావడం వల్ల చిన్న పిల్లలను బయటకు పంపలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మురికి కాలువలోని నీటిని తొలగించేలా పరిష్కార చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.





## 'ప్రశ్నిస్తే కేసులు పెడతారా'

**చెన్నూర్, మే 27 (ప్రభాత సమాచారం)**

రైతులకు న్యాయం చేయాలని ప్రశ్నించిన బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి వేధిస్తుందని బీఆర్ఎస్ పార్టీ చెన్నూరు పట్టణ సోషల్ మీడియా ఇన్‌చార్జి, మాజీ కౌన్సిలర్ రేవల్లి మహేష్ అన్నారు. చెన్నూరులో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయాలని సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించినందుకు చెన్నూర్ పట్టణంలోని ఎనిమిది మంది బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టిందని ఆరోపించారు. ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులు గాలిపల్లి రవి, కమటం మనోహర్, ఎండీ నాయబ్, శంషీర్ ఖాన్, రేవెల్లి రాజు, బోగే భారతి, సుద్దాల ప్రశాంత్, రేవెల్లి మహేష్ లపై కేసులు పెట్టారని ఆయన విమర్శించారు. ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టిన ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ నెరవేర్చే వరకు ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

## తాజా మాజీ సర్పంచుల అరెస్టు

**కడెం, మే 27 (ప్రభాత సమాచారం)**

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేయడానికి హైదరాబాద్ వెళ్లేందుకు సిద్ధమైన తాజీ మాజీ సర్పంచులను కడెం పోలీసులు అరెస్టు చేశారు. కడెం మండలంలోని పలు గ్రామాలకు చెందిన మాజీ సర్పంచుల ఇళ్లలోకి ఉదయాన్నే వెళ్లి అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇలాంటి అరాచకాలకు పాల్పడుతున్నదని, ఇళ్లలో నుంచి సర్పంచులను అరెస్టు చేసి తీసుకురావడం ఏంటని మండిపడ్డారు. తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులు ఇవ్వాలని ఏడాది కాలంగా అడుగుతుంటే తమ సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి బిల్లుల కోసం ఎదురు చూస్తున్న తమకు బిల్లులు ఇచ్చి ఊరటనివ్వాల్సింది పోయి అరెస్ట్ చేస్తారా అని ఆవేదన వ్యక్తం చేశారు.



# సర్వేయర్లు నిబంధనలు పాటించాలి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్






**మంచిర్యాల, మే 27 (ప్రభాత సమాచారం)**

భూసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చేపట్టిన భూ భారతి నూతన ఆర్.ఓ.ఆర్. చట్టంలో పొందుపరిచిన ప్రతి అంశాన్ని లైసెన్స్ సర్వేయర్లు పూర్తిగా తెలుసుకొని ఉం డాలని, సమస్యల పరిష్కారంలో నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని మంచిర్యాల పట్టణంలో గల శ్రీఉషోదయ పాఠశాలలో ఏర్పాటు చేసిన లైసెన్స్ సర్వేయర్ల శిక్షణ కార్యక్రమానికి జిల్లా సర్వే, భూరికార్డుల ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే శ్రీనివాస్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూములకు సంబంధించి వివిధ రకాల సర్వే నిర్వహించవలసి ఉంటుందని, ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, ప్రాజెక్టుల సందర్భంగా భూసేకరణకు సంబంధించి నిర్వహించే సర్వే, ఎఫ్ లైన్ సర్వే వంటి వివిధ సందర్భాలు ఉంటాయన్నారు. సర్వే ప్రక్రియలో సర్వేయర్ల పాత్ర కీలకమైనదని, గ్రామాలు, మండలాల అంతర్గత సరిహద్దుల నిర్ణయంలో, సరిహద్దు వివాదాల పరిష్కారంలో ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ నేపథ్యంలో సర్వేయర్లకు అందించే శిక్షణ ఎంతో ముఖ్యమని, శిక్షణలో ప్రతి అంశాన్ని ఏకాగ్రతతో నేర్చుకోవాలని, చట్టంను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. జిల్లాలో శిక్షణ కార్యక్రమానికి 162 మంది హాజరు కావలసి ఉండగా 153 మంది హాజరయ్యారని తెలిపారు. ఆధునిక సాంకేతికను వినియోగించుకొని సర్వేలో చిత్తశుద్ధితో పని చేయాలని, సర్వే ప్రక్రియలో ప్రతి చర్యను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



### హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపనను

# విజయవంతం చేయాలి

### ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**ఇంద్రవెల్లి, మే 27 (ప్రభాత సమాచారం)**

మండలంలోని దస్నాపూర్ గ్రామంలో ఈనెల 29న జరిగే హనుమాన్ విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యుడు వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. మంగళవారం ఇంద్రవెల్లి మండలంలోని ముత్నూర్ గ్రామంలో గల రైతు వేదిక భవనంలో కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..హనుమాన్ విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖాడే ఉత్తం, ఆంధ్ ఆదివాసీ సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖాడే విష్ణు, వ్యవసాయ అధికారి గణేష్ రాథోడ్, ఆంధ్ ఆదివాసీ సంఘం జిల్లా కార్యదర్శి మారుతి, పుండలిక్ పటేల్, కేశవ్, గజానంద్ పాల్గొన్నారు.

### పాఠశాల అభివృద్ధిలో

# భాగస్వామ్యం కావాలి

### నిర్మల్ జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు

**నిర్మల్, మే 27 (ప్రభాత సమాచారం)**

పాఠశాల అభివృద్ధిలో ఉపాధ్యాయులు భాగస్వామ్యం కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు అన్నారు. మంగళవారం నిర్మల్ జిల్లాలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను సందర్శించి మాట్లాడారు. పాఠశాల అభివృద్ధిలో ప్రధానోపాధ్యాయుల బాధ్యత చాలా కీలకమైందన్నారు. పాఠశాలను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలని, అందుకు ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయుల సహకారం కూడా చాలా అవసరం అని ఆయన తెలిపారు. విద్యార్థులు యొక్క నమోదు, విద్యార్థుల్లో విద్యా ప్రగతి, విద్యా కార్యక్రమాల నిర్వహణ, విద్యార్థుల్లో సంపూర్ణ అభివృద్ధి, పాఠశాలలో నూతన కార్యక్రమాల అమలు, విద్యార్థులను పోటీ పరీక్షల్లో పాల్గొనేలా చేయడం, విద్యార్థులు అన్ని రంగాల్లో ముందంజలో ఉండేలా చూసుకోవడం, క్రీడా నైపుణ్యాలు అలవర్చడం, వారి ఆరోగ్య పరిస్థితిని నిత్యం సమీక్షించడం, క్రమశిక్షణను అలవర్చడం, పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు సాధించి పెట్టడం, ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు కలిసి గ్రామస్తులతో సత్సంబంధాలు ఏర్పరచుకొని పాఠశాల అభివృద్ధికి కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో నమోదును పెంచి పాఠశాలపై గ్రామస్తుల్లో నమ్మకం పెంచాలని సూచించారు. విద్యార్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు గుర్తిస్తూ, అభినందనలు తెలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ నర్సయ్య, సీఎంఓ ప్రవీణ్ కుమార్, రీసెర్చ్ ఉపాధ్యాయులు పరమేశ్వర్, మైసాజీ, రాజశేఖర్, విజయ్‌కుమార్‌లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.





# రైస్ మిల్లర్లు లక్ష్యాలను పూర్తి చేయాలి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మే 27 (ప్రభాత సమాచారం)**

రైస్ మిల్లర్లు ఖరీఫ్ 2024-25 సంబంధించి సి.ఎం.ఆర్. డెలివరీ నిర్దేశిత లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కలెక్టర్ చాంబర్లో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్‌తో కలిసి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లతో సి.ఎం.ఆర్. డెలివరీ, 2022-23 రబీ ధాన్యం వేలం అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2024-25 ఖరీఫ్ సంబంధించిన సి.ఎం.ఆర్. (కస్టమ్ మిల్లింగ్ రైస్) డెలివరీ లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని, పెండింగ్ ఎ.సి.కె. లక్ష్యాలను సైతం పూర్తి చేసి రబీకి సంబంధించి ధాన్యం ప్రక్రియను ప్రారంభించాలని తెలిపారు. సకాలంలో డెలివరీ పూర్తి చేయని పక్షంలో ధాన్యం దెబ్బతినే అవకాశం ఉంటుందని తెలిపారు. మిల్లుల వారిగా పెండింగ్‌లో ఉన్న లక్ష్యాల వివరాలను తెలుసుకొని అధికారులు, రైస్ మిల్లర్లు సమన్వయంతో పని చేసి త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైస్ మిల్లులకు రోజు వారీ లక్ష్యాలు నిర్ణయించి, వాటిపై సమీక్షించాలని పేర్కొన్నారు. పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏ రైస్‌మిల్లు లక్ష్య సాధనలో వెనుకబడి ఉన్నాయో గుర్తించాలని, నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. వారు సీఎంఆర్ ఎందుకు ఇవ్వడం లేదో తెలుసుకోవాలని, సరైన ప్రణాళిక రూపొందించి లక్ష్యం చేరుకునేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. లక్ష్యం పూర్తి చేయడంలో రైస్ మిల్లర్లకు ఉన్న ఇబ్బందులను పరిష్కరించాలని సూచించారు. 2022-23 రబీకి సంబంధించి ధాన్యం వేలంలో వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానాలో జమ చేయాలని, లేని పక్షంలో తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, ఆర్.ఐ. మురళీకృష్ణ, సంబంధిత అధికారులు, రైసిమిల్లర్ల సంఘం ప్రతినిధులు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

# జడ్జీని కలిసిన ఎఫ్ఆర్ఓ



**లక్షెట్టిపేట, మే 27 (ప్రభాత సమాచారం)**

లక్షెట్టిపేట కోర్టు సీనియర్ సివిల్ జడ్జీ సాయికుమార్‌ను జన్నారం మండలంలోని ఇంధన్‌పల్లి అటవీశాఖ ఎఫ్ఆర్ఓ కారం శ్రీనివాస్ కలిశారు. సోమవారం ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ కోర్టులోని న్యాయమూర్తి చాంబర్‌లో న్యాయమూర్తిని కలిసి పలు విషయాలు చర్చించారు. కవ్వాల్ అభయారణ్యంలో వన్య ప్రాణులు, అటవీ సంరక్షణకు తీసుకుంటున్న చర్యల గురించి న్యాయమూర్తికి ఎఫ్ఆర్ఓ వివరించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వికలాంగుడికి ఎస్కే గ్రూప్ చేయూత

**ఇంద్రవెల్లి, మే 27 (ప్రభాత సమాచారం)**

మండలంలోని ధర్మసాగర్ గ్రామానికి చెందిన వికలాంగుడు సాబ్లే జైత్రాం ఇటీవల కురిసిన భారీ వర్షానికి ఇల్లు దెబ్బతిని నష్టపోయాడు. తాను ఫైనాన్స్‌పై తీసుకొన్న ఆటో వాయిదాలు చెల్లించకపోవడంతో ఫైనాన్స్ కంపెనీ వారు ఆటోను తీసుకువెళ్లడంతో అతడు ఉపాధి కోల్పోయాడు. ఆ గ్రామాన్ని సందర్శించిన ఎస్‌కె గ్రూప్ చైర్మన్ జె. కృష్ణ బాధితుడికి తిరిగి ఆటో ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు మంగళవారం సాబ్లే జైత్రాం బకాయ పడ్డ ఆటో బకాయలను ఫైనాన్స్ కంపెనీకి చెల్లించి ఆటో జైత్రాంకు ఇప్పించారు.





# సేవలతో గుర్తింపు వస్తుంది

**లక్షెట్టిపేట, మే 27 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వ అధికారులకు బదిలీలు సహజమేనని, వారు చేసే మంచి సేవలతో గుర్తింపు వస్తుందని మంచిర్యాల ఏసీపీ ప్రకాష్ అన్నారు. మంగళవారం రాత్రి లక్షెట్టిపేట పట్టణంలో నిర్వహించిన సీఐ నరేందర్ ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొన్నారు. లక్షెట్టిపేట సిఐగా అల్లం నరేందర్ మంచి సేవలు అందించారని తెలిపారు. నరేందర్ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తెచ్చారన్నారు. బదిలీపై వెళ్తున్న సిఐ నరేందర్‌ను ఘనంగాసన్మానించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

# జీవో 6ను రద్దు చేయాలని ఆర్డీవోకు వినతి



**బెల్లంపల్లి, మే 27 (ప్రభాత సమాచారం)**

ఎస్సీ విద్యార్థుల ఫీజు చెల్లింపు సంబంధించి జి.ఓ నం.6ను రద్దు చేయాలని మాదిగ స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎస్యూ నాయకులు మాట్లాడారు. ఏప్రిల్ 22న తెలంగాణ ప్రభుత్వం జి.ఓ నం.6ను విడుదల చేసిందన్నారు. ఈ జీవోలో ఎస్సీ విద్యార్థులు స్కాలర్షిప్ మంజూరు కావడానికి ముందే ట్యూషన్ ఫీజును పూర్తిగా చెల్లించాల్సిందిగా ఉందన్నారు. ఈ నిర్ణయం వల్ల క్యాంపస్‌లోని చాలా మంది విద్యార్థులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పేద కుటుంబాల నుంచి వచ్చినవాళ్ళు ఈ జి.ఓ.కు ముందు, ట్యూషన్ ఫీజును ప్రభుత్వం నేరుగా స్కాలర్షిప్ రూపంలో చెల్లించేదనీ పేర్కొన్నారు. ఇప్పుడు ముందుగా వేల రూపాయల్లో ఫీజు చెల్లించాలి, తదుపరి స్కాలర్షిప్ మంజూరు అవుతుందనీ తెలిపారు. ప్రస్తుతం క్యాంపస్‌ల్లో దాదాపు వందల మంది ఎస్సీ విద్యార్థులు అందరూ కూడా ఆర్థికంగా వెనుకబడిన వారనీ తెలిపారు. చాలామంది సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల్లో ఉన్నారని, వారిపై వేల రూపాయల్లో భారం పడుతుందన్నారు. ఈ విషయమై మన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి ఈ జిఓ నెం.6ను రద్దు చేయాలని మాదిగ స్టూడెంట్ యూనియన్ నాయకులు ఈ సందర్భంగా కోరారు. మునుపటి విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ద్వారా ఎస్సీ విద్యార్థులకు ఉన్నత చదువులకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి వేశారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్డి రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ చిలుక రాజనర్సు, మాదిగ స్టూడెంట్ యూనియన్ నాయకులు దుర్గయ్య, కోళ్ల రమేష్, ఆకులూరి రాజ్ కుమార్, గోగర్ల శేఖర్, కలువల అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### వరద నీటితో ఉధృతంగా

# ప్రవహించిన వాగులు



**ఖానాపూర్, మే 27 (ప్రభాత సమాచారం)**

భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో ఖానాపూర్ నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో ఉన్న వాగులు వరద నీటితో ఉధృతంగా ప్రవహించాయి. మంగళవారం నియోజకవర్గంలోని కడెం, ఉట్నూర్ తదితర మండలాల్లో భారీ వర్షాలు పడ్డాయి. దీంతో కడెం మండలంలోని ఉడుంపూర్, ఉట్నూర్ మండలంలోని దంతన్ పల్లి గ్రామాల శివారులో ఉన్న వాగులు వరద నీటితో ఉధృతంగా ప్రవహించాయి. ఇదిలా ఉండగా మంగళవారం ఉదయం నుంచి కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని తడిసిపోయింది.. ఆరబెట్టిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.






# విధుల్లో నిర్లక్ష్యం చేయొద్దు

■ ప్రభుత్వ పథకాలు అర్హులైన వారందరికీ అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం ■ ధాన్యం కొనుగోలు వేగం చేయాలి
■ వీడియోకాన్ఫరెన్సులో కలెక్టర్లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు

నిర్మల్, మే 27 (ప్రభాత సమాచారం)
అర్హులైన నిరుపేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం హైదరాబాదు నుంచి మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావులతో కలిసి సిఎం జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, అన్ని జిల్లాలలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులకు ధాన్యం కొనుగోలులో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలిగేలా ప్రవర్తించే అధికారులు, మిల్లర్లపై చర్యలకు ఉపేక్షించవద్దని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం 64.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. ఇందుకు 12,184 కోట్లు చెల్లించామని అన్నారు. ఇప్పటికే 90 శాతం ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి అయిందని తెలిపారు. ధాన్యం కొన్న 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేయడం జరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో నకిలీ విత్తనాలను పూర్తిస్థాయిలో నియంత్రించాలని సిఎం అధికారులను ఆదేశించారు. కలెక్టర్లు స్వయంగా విత్తన దుకాణాలను తనిఖీలు చేస్తూ నకిలీ విత్తనాలను నియంత్రించాలని అన్నారు. నకిలీ విత్తనాల సరఫరా, అమ్మకం దారులపై పిడి చట్టం నమోదు చేయాలని తెలిపారు. పంటల సాగుకు తగినన్ని విత్తనాలను, ఎరువులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఎక్కడ కూడా విత్తనాల ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలలో పైలెట్ ప్రాజెక్టుగా ఒక మండలం చొప్పున అమలుపరిచిన భూభారతి చట్టం విజయవంతం అయిందని, త్వరలోనే పూర్తిస్థాయిలో భూభారతి చట్టాన్ని అమలు చేస్తామని అన్నారు. జూన్ 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు భూభారతి మూడవ దశ గ్రామ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో కలెక్టర్లది కీలక బాధ్యత అని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుకను సరఫరా చేస్తున్నామని, నిర్మాణ ధరలను నియం త్రించేందుకు మండల స్థాయిలో ధరల నియంత్రణ కమిటీలు ఏర్పాటు చేసి నిర్మాణ సామాగ్రి, మ్యాన్ పవర్ ధరలను నియంత్రణలో ఉంచాలన్నారు. ఇండ్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లను అందిస్తామని తెలిపారు. నిర్మాణంలో అధునాతన సాంకేతిక పద్ధతులను వినియోగించి నిర్మాణ ఖర్చులను తగ్గించాలని సూచించారు. అన్ని జిల్లాల ఇంచార్జీ మంత్రులు ఈనెల 29, 30వ తేదీలలో ఆయా జిల్లాలలో పర్యటించి సమీక్షలు నిర్వహించి 1వ తేదీ లోపు నివేదికలను అందించాలన్నారు. జూన్ 2 తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని సిఎం ఆదేశించారు. వర్షాకాలం కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ముందస్తు చర్యలను తీసుకోవాలన్నారు. అన్ని జిల్లాలలో సరిపడినన్ని మందులు, తగినంత మంది వైద్యులు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కలెక్టర్లంతా ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి, ప్రజల సమస్యలను పరిష్కరించాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, ఇప్పటికే జిల్లాలో 1 లక్షా



30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. మిగిలిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అధికారులంతా కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాజీవ్ యువ వికాసానికి సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డిఓ రత్నకళ్యాణి, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.



## అత్యవసర పరిస్థితుల్లో 18004251939 నెంబర్‌కు కాల్ చేయండి

### ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్, మే 27 (ప్రభాత సమాచారం)
భారీ వర్షాల కురుస్తున్న నేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లో 18004251939 కంట్రోల్ నెంబర్‌కు కాల్ చేయాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తున్నందున ఏ విధమైన ఆస్తి నష్టం కలగకుండా అధికారులు హెడ్ క్వార్టర్ లోనే ఉండి పర్యవేక్షించాలని, తెలిపారు. వర్షాల కారణంగా ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నాలాలో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి డ్రైనేజీ నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. శిథిలావస్థకు చేరిన పాత ఇళ్లు వర్షాలకు నాని కూలిపోయే అవకాశం ఉన్నందున అక్కడ నివసించే వారిని ఖాళీ చేయించాలని, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్ల వల్ల జరిగే ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు.

## అట్టహాసంగా అథ్లెటిక్స్ పోటీలు

ఆసిఫాబాద్, మే 27 (ప్రభాత సమాచారం)
జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడా పాఠశాలలో మంగళవారం జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీలు అట్టహాసంగా జరిగాయి. అండర్ 8, 10 ,12 విభాగాల్లో నిర్వహించిన ఈ ఎంపిక పోటీలకు జిల్లా నుండి 50 మం ది క్రీడాకారులు హాజరయ్యారని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సట్ల శంకర్ తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన 20 మంది రాష్ట్ర స్థాయికి ఎంపిక అయ్యారని వీరు జూన్ 1న హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో జరగనున్న 11వ తెలంగాణ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన క్రీడల అధికారి మీనా రెడ్డి, అథ్లెటిక్స్ అసోసియేషన్ కోశాధికారి గుండం



లక్ష్మణ్, కోచ్ విద్యాసాగర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఆర్డీవో కార్యాలయం ఎదుట గ్రామస్తుల ఆందోళన



### అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

ఆసిఫాబాద్, మే 27 (ప్రభాత సమాచారం)
ఆసిఫాబాద్ మండలంలోని ఇప్పల్ నవేగాం గ్రామస్తులు మంగళవారం ఆర్డివో కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ తాతల కాలం నుండి గ్రామంలో నివసిస్తున్న తమను ఊరు ఖాళీ చేసి వెళ్లిపోవాలని కొంతమంది బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా స్థిరనివాసం ఏర్పరచుకొని జీవనం గడుపుతున్న తమను ఉన్నపలంగా వెళ్ళిపోవాలని హుకుం జారీ చేస్తున్నారని అధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు. ఆర్డీవో కార్యాలయం ఎదుట దాదాపుగా గంటసేపు ఆందోళన చేపట్టగా ఆర్డీవో అందుబాటులో లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. వర్షన్ని సైతం లెక్క చేయకుండా కార్యాలయం ఎదుట బైఠాయించారు. వర్షం ఎక్కువ కావడంతో చేసేది ఏమీ లేక వెనుదిరిగి వెళ్ళిపోయారు. వీరికి జాతీయ హుమెన్ రైట్స్ కమిషన్ జిల్లా చైర్మన్ రమేష్ మద్దతు పలికారు. అమాయకమైన ప్రజలను బెదిరింపులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు.

## ప్రజా ఫిర్యాదుల స్వీకరణ వాయిదా

నిర్మల్, మే 27 (ప్రభాత సమాచారం)



ప్రతి బుధవారం నిర్మల్ జిల్లా పోలీస్ క్యాంప్ కార్యాల యంలో నిర్వహించే ఎస్పీ ప్రజా ఫిర్యాదుల స్వీకరణను వర్షాలు దృష్ట్యా వాయిదా వేస్తున్నట్టు జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తరువాత ఫిర్యాదుల స్వీకరణ నిర్వహణ విషయమై అధికారిక ప్రకటన చేస్తామన్నారు. అత్యవసర సంబంధిత ఫిర్యాదులను నేరుగా ఎస్పీ కార్యాలయంలో అందజేయవచ్చునని సూచించారు.

## అటవీ అధికారులతో వాగ్వాదం

బోథ్, మే 27 (ప్రభాత సమాచారం)
బోథ్ మండలంలోని కౌట(బీ) గ్రామ సమీపంలో అటవీ శాఖ భూముల్లో చెట్లు నాటేందుకు మంగళవారం అటవీ శాఖ అధికారులు చేరుకొని అటవీ భూముల్లో చెట్లు నాటేందుకు జేసీబీతో చదును చేస్తుండగా అటవీ భూమి సాగు చేస్తున్న రైతులు అధికారులతో వాగ్వాదానికి దిగిన ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే కౌట గ్రామానికి చెందిన ఓ రైతు అటవీ భూమిని సాగు చేయడంపై పలువురు గతంలో అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేయగా అప్పటి అటవీశాఖ అధికారి ఆధ్వర్యంలో భూమిని స్వాధీనం చేసుకుని మొక్కలు నాటారు. అయితే రైతు ఈ సంవత్సరం అందులో నుండి మొక్కలు తొలగించి పంట వేసేందుకు భూమిని దున్ని సిద్ధం చేసాడు. ఈ విషయం తెలిసి ఎఫ్ఆర్డీఓ ప్రణయ్ సిబ్బందితో అక్కడికి చేరుకోగా అటవీ భూములు సాగు చేస్తున్న వారు జెసిబిని అడ్డుకొని, అటవీశాఖ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ మాట్లాడుతూ కోర్టు వివాదంలో ఉన్న అటవీ భూముల్లో ఎవరు పంట సాగు చేయవద్దని ప్రభుత్వ ఆదేశాల మేరకు అటవీ భూముల్లో చెట్లు నాటుతున్నామన్నారు. పెంబి మండలంలోని ఇటిక్యాల్ గ్రామంలోని ఎస్సీ, బీసీ, మైనారిటీ పోడు భూముల రైతులు, అటవి శాఖ అధికారుల మధ్య మంగళవారం వాగ్వాదం చోటు చేసుకుంది. ప్రజలు సాగు చేస్తున్న పోడు భూముల్లో మంగళవారం ఫారెస్ట్ అధికారులు మొక్కలు నాటడానికి వెళ్లడంతో అది తెలిసిన పోడు రైతులు అక్కడికి వెళ్లి అడ్డుకోవడంతో వాగ్వాదం చోటుచే సుకుంది. దాదాపు రెండు గంటల పాటు రైతులకు, అధికారులకు మధ్య వాగ్వాదం జరిగింది. రైతులు ఆందోళనకు దిగడంతో అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

## నకిలీ ఇన్సూరెన్స్ కంపెనీలతో జాగ్రత్తగా ఉండాలి : డీఎస్పీ జీవన్ రెడ్డి



ఆదిలాబాద్, మే 27 (ప్రభాత సమాచారం)
పట్టణంలో ప్రజల వద్ద ఇన్సూరెన్స్ పేరుతో డబ్బులను కట్టించుకున్న యూనిట్ మరికంట్రైన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రజలు కట్టిన ఇన్సూరెన్స్‌ను పూర్తయినా తిరిగి చెల్లించడం లేదని బాధితులు ఫిర్యాదు చేయడంతో ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులను నమోదు చేసినట్లు డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. బాధితులు అదిలాబాద్ పట్టణానికి చెందిన బాకే సరిత హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన అరక అశోక్, దస్నాపూర్‌కు చెందిన వీరు దాదాపు 5 లక్షల వరకు ఇన్సూరెన్స్ చెల్లించి తిరిగి యూనిక్ మరికంట్రైన్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా డబ్బులు లేదన్నారు. సంస్థకు ఏజెంట్‌గా పనిచేసిన సేవ సింగ్ రిటైర్డ్ టీచర్ సంజయ్ నగర్‌కు చెందిన వ్యక్తిపై, అతని భార్యపై రెండు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సంస్థ కు ఆదిలాబాద్ పట్టణంలో ఏజెంట్‌గా పనిచేసి బాధితుల వద్ద నుండి డబ్బులను సేకరించి ప్రస్తుతం ఎలాంటి సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రజలందరూ ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ, డెవలప్మెంట్ అథారిటీ ద్వారా ఆమోదించిన వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు.




## జిల్లా కలెక్టర్లు అధికారులతో కలిసి
# క్షేత్రస్థాయిలో పర్యటించాలి

- ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి
- రైతులను ఇబ్బందులకు గురిచేసే రైస్‌మిల్లర్లపై వారిపై చర్యలు తీసుకోండి..
- వర్షాల దృష్ట్యా అధికారులు అప్రత్తమంగా ఉండాలి
- జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం..



**మంచిర్యాల, మే 27 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమాభివృద్ధి పథకాల అమలులో జిల్లా కలెక్టర్లు అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనులు వేగవంతం చేయాలని రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబా ద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుండి రాష్ట్ర పౌరస రఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర శాఖల మంత్రులు, ఉన్న తాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్, జిల్లా అధికారులతో వరి ధాన్యం కొనుగోలు, వ్యవసాయం, భూభారతి, ఇందిరమ్మ ఇండ్లు అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తుం దని, ఆ దిశగా అధికార యంత్రాంగం సమన్వయంతో పని చేయాలన్నారు. వరిధాన్యం సేకరణ గతంతో పోల్చితే ఈ సంవత్సరం అధికంగా జరిగిం దని, ఇప్పటి వరకు 64 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల వరిధాన్యం సేకరించి 12 వేల184 కోట్ల రూపాయలు 10.55 లక్షల మంది రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగిందని, ఇంత వరకు 90 శాతం ధాన్యం సేకరణ పూర్తి చేయడం జరిగిందని, కొను గోలు చేసిన 48 గంటలలో సంబంధిత రైతుల ఖాతాలలో నగదు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ధాన్యం నిల్వల కొరకు అవస రమైతే స్థానికంగా ఉండే గోదాము లను అద్దెకు తీసుకోవా లని, రైతులను ఇబ్బందులకు గురి చేసే రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. వర్షా కాలం సంబంధించిన ఋతుపవనాలు ఈ సంవత్సరం 15 రోజుల ముందుగా రావడంతో ధాన్యం సేకరణ ప్రక్రియలో మిగిలిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, వాతావరణ పరిస్థితులలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, దినపత్రికలలో వచ్చే ప్రతికూల వార్తలపై తక్షణమే స్పందించి ప్రజలకు వాస్త వాలను తెలియజేయాలని సూచించారు. ప్రభుత్వం చేపడు తున్న ప్రజాహిత కార్యక్రమాలపై ప్రజలకు తెలిసే విధంగా ప్రచారం నిర్వహించాలని, తప్పుడు / అవాస్తవ ప్రచారం చేసే వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈసారి ఋతుపవనాలు ముందుగానే రాష్ట్రానికి చేరడంతో తదనుగుణంగా నాట్లు, విత్తనాలు, ఎరువులు, పంట సాగు అంశాలపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. నకిలీ / నిషే ధిత విత్తనాల విక్రయం, తరలింపుపై కఠిన చర్యలు తీసు కోవాలని, అవసరమైతే వారిపై పి.డి. యాక్టు నమోదు చేయాలని, నకిలీ / నిషేధిత విత్తనాల వినియోగం వలన కలిగే నష్టాలపై రైతులకు అవగాహన కల్పించాలని తెలి పారు. ఆయా జిల్లాల కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, జిల్లాల వారిగా ప్రత్యేక అధికారిని నియమమించి పర్యవే క్షించాలని, వివరాలను సంబంధిత ఇన్చార్జ్ మంత్రులు, ముఖ్యమంత్రి కార్యాలయానికి అందించాలని తెలిపారు. భూసమస్యల పరిష్కారం కొరకు చేపట్టిన భూభారతి నూతన ఆర్.ఓ.ఆర్. చట్టం -2025లో భాగంగా ముందుగా రాష్ట్రం లోని 4 జిల్లాలో 4 మండలాలను పైలెట్ మండలాలుగా ఎంపిక చేయడం జరిగిందని, మిగిలిన జిల్లాలలో జిల్లాకు ఒక మండలం చొప్పున ఎంపిక చేసి రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూసమస్యల సంబంధిత దరఖాస్తులు స్వీకరిం చడం జరుగుతుందని తెలిపారు. జూన్ 3వ తేదీ నుండి 20వ తేదీ వరకు 3వ విడత రెవెన్యూ సదస్సులు నిర్వహిం చాలని, తదనుగుణంగా అధికారులు, సిబ్బంది కార్యచరణ రూపొందించుకొని తగు చర్యలు చేపట్టాలని తెలిపారు. అర్హులైన నిరుపేదలకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు అందే విధంగా పర్యవేక్షించాలని, అధికారులు, స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు చేసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన సామాగ్రి ధరలను నియం త్రించాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి నిబంధనలకు అనుగుణంగా ఉచిత ఇసుక అందించడం జరుగుతుందని, అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని తెలిపారు. ఇటుక తయారీ, సెంట్రింగ్ యూనిట్స్ ఏర్పాటుకు రాజీవ్ యువ వికాసం, ఇందిరా మహిళా శక్తి పథకాల లబ్దిదారులకు అవ కాశం కల్పించి ప్రోత్సహించాలని, ఆధునిక సాంకేతికతను వినియోగించుకొని ఇంటి నిర్మాణం చేపట్టాలని, నిర్మాణ పనుల పురోగతి సంబంధిత ఫొటోలను పోర్టల్లో నమోదు చేయాలని తెలిపారు. జూన్ 1వ తేదీ నాటికి పూర్తి నివేదిక అందించాలని, జూన్ 2వ తేదీన రాష్ట్ర ఆవిర్భావ దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళికలు తయారు చేసి అందించాలని తెలిపారు. ప్రస్తుతం కొవిడ్ వైరస్ వ్యాపిస్తున్న దృష్ట్యా వైద్య-ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవసరమైన చర్యలు చేపట్టడంతో పాటు వైరస్ నియంత్రించేందుకు పాటించవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన వరిధాన్యం కొనుగోలు, వ్యవసాయం, భూభారతి, ఇందిరమ్మ ఇండ్లు పథకాల లక్ష్యాలను సమన్వయంతో పూర్తి స్థాయిలో సాధించే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి

- కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి
- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**వేమనపల్లి, మే 27 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో చేపట్టిన వరిధాన్యం కొనుగోలు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని వేమనపల్లి మండలం నీల్వాయి, గొర్లపల్లి, వేమనపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను తహశీల్దార్ సంధ్యారాణితో కలిసి సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రస్తుతం నెలకొన్న అకాల వర్షాల పరిస్థితులలో కొనుగోలు కేంద్రాలలోని ధాన్యాన్ని వెంటనే కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించాలని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో నిబంధనల ప్రకారం రైతుల నుంచి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. సన్న రకం వడ్లు విక్రయించిన రైతులకు మద్దతు ధరతో పాటు రూ. 500 రూపాయల అదనపు బోనస్ అందించడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతుల కోసం త్రాగునీరు, నీడ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైన గోనెసంచులు, టార్పాలిన్లను సమకూర్చడం జరిగిందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందన్నారు. జిల్లాలో నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేసిన కొనుగోలు కేంద్రాలను



మూసి వేయడం జరిగిందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వహకులు వారికి కేటాయించిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేసే విధంగా సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఆయన వెంట సంబంధిత అధికారులు, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు తదితరులు ఉన్నారు.



## ఉప్పొంగిన ఎర్రవాగు

### ఆరు గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు

**నెన్నెల, మే 27 (ప్రభాత సమాచారం)**

మండలంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. దీంతో లంబాడి తండా ఎర్రవాగు ఉప్పొంగి ప్రవహించ డంతో ఆరు గ్రామా లకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎర్రవాగు వద్ద వంతెన నిర్మాణం పనులు ఇటీవల చేప ట్టారు. దాని పక్కనే తాత్కాలిక రోడ్ వేసి రాకపోకలు సా గించారు. అయితే భారీ వర్షం పడటం వలన తాత్కా లికంగా వేసిన రోడ్ తెగి పోయింది. దీంతో లంబాడి తండా, కుర్మగూడెం, కోణంపేట, జంగళపేట, ఖర్జీ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గొల్లపల్లి, మైలారాం, చిత్తపూర్, అవుడం, గంగారాం గ్రామాలలో ధాన్యం కుప్పలు తడిసి పోయాయి. ప్రజలు అప్ర మత్తంగాఉండాలని అధికారులు సూచించారు.

## విద్యుత్తు సమస్యలకు కంట్రోల్ రూమ్ నెం 9440811700

**ఆదిలాబాద్, మే 27 (ప్రభాత సమాచారం)**

పట్టణంలోని పరిసర ప్రాంతాల్లో వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్తు స్థంబాలు, తీగలు తెగిపడి ఉంటే వెంటనే విద్యుత్తు కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేయాలని కార్యా లయ సిబ్బంది వెంకటేష్ అన్నారు. విద్యుత్తు స్థంబాల కింద ప్రజలు నిలబడకుండా చర్యలు తీసుకోవాల న్నారు. విద్యుత్తు సమస్యలుతలెత్తితే 9440811700 నెంబరును సంప్రదించాలని పేర్కొన్నారు.

## బాసర హుండీ ఆదాయం లెక్కింపు

**బాసర, మే 27 (ప్రభాత సమాచారం)**

బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ హుండీలను మంగళవారం లెక్కించారు. 60 రోజులకు గాను 77,77,746 రూపా యల ఆదాయం లభిం చింది. మిశ్రమ బంగారం 126 గ్రాములు, మిశ్రమ వెండి 1కిలో 440 గ్రాములు, విదేశీ నోట్లు 17 సమ కూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



# నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్సులు రద్దు

### జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్ రావ్

**ఉట్నూర్, మే 27 (ప్రభాత సమాచారం)**



డీలర్లు నిబంధనలు పాటిస్తూ రైతులకు నాణ్యమైన విత్తనా లను విక్రయించాలని, నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్స్ లు రద్దు చేసి, కేసులు నమోదు చేస్తామని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కు విశ్వనాథ్ రావ్ హెచ్చరించారు. మంగళవారం జైనూర్‌లోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జైనూర్ మార్కెట్ పరిధిలోని ఆయా మండలాల్లో రైతులకు ఫర్టిలైజర్ షాప్ నిర్వాహకులు నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసు కుంటామన్నారు. రైతులు కూడా నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దని సూచించారు. రైతులు కొనుగోలు చేసిన ప్రతి విత్తనాలకు సంధించిన రశీదులు దగ్గర పెట్టుకో వాలన్నారు. ఒకటికి రెండు సార్లు విత్తనాలను పరిశీలించిన తర్వాతనే కొనుగోలు చేయాలన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు షేకు, లింగు, మాజీ సర్పంచ్ లు, నాయకులు శంకర్, అమృత్, దత్తు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

## కార్యకర్తలు ప్రజల వద్దకు వెళ్లాలి - కార్యకర్తల సమావేశంలో మంత్రి సీతక్క

**ముథోల్, మే 27 (ప్రభాత సమాచారం)**

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని మంత్రి సీతక్క కాంగ్రెస్ కార్యకర్తలకు సూచించారు. ముథోల్ మండలంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన సీతక్క అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసిన వారికి పదవులు వస్తాయని పేర్కొన్నారు. ప్రజాభిప్రాయం మేరకు ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని అన్నారు. గతంలో చేసిన తప్పులు పునర్వృతం కాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని పనిచేయాలన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లడం లేదని, ప్రజాప్రతినిధులు కార్యకర్తల అవసరం తీర్చినప్పుడే పార్టీ మనగడతో పాటు వ్యక్తిగతంగా పదవులు వస్తాయన్నారు. పదవి కోసం, పలుకుబడి కోసం పార్టీలో పనిచేస్తూ ప్రజలను విస్మరిస్తే పార్టీలో ఉండవలసిన అవసరం లేదన్నారు. గ్రూపు రాజకీయాలను వీడి



ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ప్రభుత్వ ఆశయాలకు అనుకూలంగా నడిచే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందన్నారు. ఒకే కుటుంబ సభ్యులుగా కలిసి పని చేయాలన్నారు. కార్యక్ర మంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, బాబు రావు, మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, పార్టీ పార్ల మెంట్ ఇన్చార్జి సుగుణ, భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావుపటేల్, కార్యకర్తలు పాల్గొన్నారు.



## సీఎస్‌ను కలిసిన ఇంద్రకరణ్‌రెడ్డి

**నిర్మల్, మే 27 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావును మంగళవారం మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసిన మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి శాలువాతో సన్మానం చేశారు. అదిలాబాద్ కలెక్టర్గా పని చేసిన రామకృష్ణారావు ఆనాటి జ్ఞాపకాలను మంత్రితో పంచుకున్నారు. ప్రజల అభివృద్ధికి పాటుపడాలన్నారు.

## ఆసిఫాబాద్ తహసీల్దార్‌గా పోచయ్య



**ఆసిఫాబాద్, మే 27 (ప్రభాత సమాచారం)**

ఆసిఫాబాద్ తహసీల్దార్‌గా పోచయ్యను నియమిస్తూ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న రోహిత్ దేశ్ పాండే మంచిర్యాల జిల్లాకు బదిలీపై వెళ్లారు. దీంతో ఆసిఫాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న పోచయ్యకు తహసిల్దార్‌గా పూర్తి అదనపు బాధ్యతలు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు తహసీల్దార్‌గా కొనసాగాలని కలెక్టర్ పేర్కొన్నారు.

## అగ్ని ప్రమాదాలపై అవగాహన



**ఖానాపూర్, మే 27 (ప్రభాత సమాచారం)**

ఖానాపూర్ పట్టణంలోని గోదాంలో అగ్ని ప్రమాదాలపై ఫైర్ సిబ్బంది మంగళవారం విన్యాసాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి ఎస్ఎఫ్ఓ జావేద్ అలీ మాట్లాడుతూ.. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగే అగ్ని ప్రమాదాలను ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఫైర్మెన్ వెంకటేష్, హోంగార్డు కృష్ణ, డ్రైవర్ ఉషేన్, గోదాం సిబ్బంది పాల్గొన్నారు.

## మూడు నెలల రేషన్ బియ్యం

**వాంకిడి, మే 27 (ప్రభాత సమాచారం)**

ఆహార భద్రత కార్డులు లబ్ధిదారులకు మూడు నెలల రేషన్ బియ్యాన్ని జూన్‌లో ఇవ్వాలని తహసీల్దార్ రియాజ్ అలీ అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. రానున్న వర్షా కాలంలో భారీ వర్షాలు, వరదల కారణంగా ఆహార ధాన్యం నిల్వ, రవాణాలో ఇబ్బందులు నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు నెలల రేషన్‌ను జూన్ ఇవ్వాలని జూన్1నుంచి 30 వరకు షాప్ నిర్వహించాలని డీలర్లకు సూచించారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీని జాతిపితగా ప్రకటించాలి



**బెల్లంపల్లి, మే 27 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ జాతిపిత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లోకి తీసుకెళ్లడానికి కొండా లక్ష్మణ్ బాపూజీ ఫెడరేషన్ హైదరాబాద్ వారు తెలంగాణ రాష్ట్ర పర్యటనలో భాగంగా మంగళవారం బెల్లంపల్లికి చేరుకోవడం జరిగింది. కొండా లక్ష్మణ్ బాబూజీ ఫెడరేషన్ ప్రచారకులు రాపోలు జ్ఞానేశ్వర్ బెల్లంపల్లి పద్మశాలి కుల బాంధవులందరికీ నిజాం నిరంకుశ వ్యతిరేక పోరాట యోధుడు జాతీయ ఉద్యమ నాయకుడు తెలంగాణ తొలి మలి దశ ఉద్యమ నాయకులు బడుగు బలహీనవర్గాల అభివృద్ధి కొరకు నిరంతరం శ్రమించి, సహకార వ్యవస్థను నిర్మించి సహకార సంఘాల ఏర్పాటు చేసి వారి జీవితంలో వెలుగు నింపడమే కాకుండా కుల సంఘాలతో పాటు బీసీ రిజర్వేషన్ల కోసం ఉద్యమించిన నాయకుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వారి ఆశయాలను ప్రచారం చేస్తూ తెలంగాణ వ్యాప్తంగా వారి ఆశయాలను తీసుకెళ్తూ బెల్లంపల్లిలో పద్మశాలి ప్రముఖులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశం లో కొండా లక్ష్మణ్ బాపుజీ ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ జాతిపితగా ప్రకటించాలని డిమాండ్ చేయడం జరిగింది. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ రెండవ తారీఖు రోజు రాష్ట్రమంతటా కొండా లక్ష్మణ్ బాపూజీ నినాదాలతో వారి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి బెల్లంపల్లిలో పుర ప్రముఖులు వివిధ బీసీ సంఘాల నాయకులతో కలసి పద్మశాలి పెద్దలు బాపూజీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకో వెళ్లాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ పద్మశాలి సంఘం సంయుక్త కార్యదర్శి కొండ రాజలింగం , ఎగ్జిక్యూటివ్ నెంబర్ మెరుగు ప్రభాకర్ మార్కండేయ ఆలయ ప్రధాన కార్యదర్శి చిదిరాల ఉమా ప్రసాద్ , కోశాధికారి మంచికట్ల రాజుగారు, ప్రచార కార్యదర్శి సుంకె లక్ష్మీనారాయణ గుండేటి శంకర్ గారు క్యాతం శ్రీనివాస్ గ గుండేటి శ్రీనివాస్ , జంజిరాల శ్రీనివాస్ గారు గుండేటి శంకర్ మార్కండేయలయ మహిళా కమిటీ అధ్యక్షురాలు శోభ రాణి పాల్గొన్నారు. ఢీకొండ రాజలింగం మాట్లాడుతూ బాపూజీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని బాపూజీ బడుగు బలహీన వర్గాల కోసం ఎంతో పోరాటం చేశారని తెలిపారు. ఉమా ప్రసాద్ ఆలయ సెక్రెటరీ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో తెలంగాణకు జరుగుతున్న వివక్షణ చూసి తట్టుకోలేక ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాదనే దీనికి పరిష్కారం అని భావించి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం తన క్యాబినెట్ మంత్రి పదవిని తృన ప్రాయంగా రాజీనామా చేసిన మహనీయుడని గుర్తు చేసుకున్నారు.



## గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థులకు వృత్తి నైపుణ్య శిక్షణ

**బెల్లంపల్లి, మే 27 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గతంలో విద్యను అభ్యసించి నిరుద్యోగులుగా ఉన్న పూర్వ విద్యార్థులకు గురుకుల విద్యా సంస్థ వృత్తి నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి ప్రణాళిక రూపొందించిందని కాసిపేట గురుకుల బాలుర పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ ఉటూరి సంతోష్ కుమార్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గురుకుల పాఠశాలలో 2017 నుంచి ఇప్పటివరకు పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి ఉన్నత చదువు అభ్యసించలేని స్థితిలో ఉండి నిరుద్యోగులుగా ఉన్న విద్యార్థులకు గురుకుల విద్యాసంస్థ ఉన్నతి ఫౌండేషన్ సహకారంతో వివిధ రంగాల్లో వృత్తి నైపుణ్య శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. 18 నుంచి 25 సంవత్సరాల మధ్య వయసు గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని,30 రోజుల పాటు ప్రతిరోజు మూడు గంటల శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తిగల విద్యార్థులు కళాశాలలో ఈనెల 30 తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కళాశాల పనివేళల్లో సంప్రదించగలరని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జీవితంలో స్థిరపడాలన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

### వ్యవసాయ డివిజన్ అధికారి సుజాత

**ఖానాపూర్, మే 27 (ప్రభాత సమాచారం)**

నకిలీ విత్తనాలు విక్రయించినా, కృత్రిమంగా విత్తనాలు ఎరువుల కొరత సృష్టించిన కఠిన చర్యలు తప్పవని వ్యవసాయ డివిజన్ అధికారిని సుజాత హెచ్చరించారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని సతనపల్లి రైతు వేదికలో ఫర్టిలైజర్ షాపుల డీలర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నకిలీ విత్తనాలు విక్రయించిన, కృత్రిమ కొరతలు సృష్టిస్తూ రైతులకు అధిక ధర లకు విత్తనాలు ఎరువులు అమ్మిన వారిపై వ్యవసాయ చట్టం ప్రకారం కేసులు బుక్ చేస్తామని అన్నారు. విత్తనాలు కంపెనీ ప్యాకింగ్‌తోనే అమ్మాలని, షాపుల్లో విడిగా అమ్మడం నిషేధం అని తెలిపారు. ఎవరైనా విడిగా విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు తప్పకుండ రసీదు ఇవ్వాలని సూచించారు. ఫర్టిలైజర్ షాపుల డీలర్స్, వ్యవసాయ అధికారి జగదీశ్వర్, వ్యవసాయ విస్తరణ అధికారి రాజేష్ పాల్గొన్నారు.

# నిర్మల్ జిల్లాలో దంచికొట్టిన వాన



**నిర్మల్, మే 27 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లాలో మంగళవారం మళ్లీ వర్షం కురవడంతో రైతులు ప్రజలు ఇబ్బందికి గురయ్యా రు. గత మూడు రోజుల నుంచి వరుసగా వర్షాలు కురవడంతో వరి ధాన్యం కేంద్రాల్లో నిలువ ఉంచిన వారి ధాన్యం నడుచుకోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో నర్సాపూర్లో 14.2, దిల్వార్పూర్‌లో 22.08, సారంగాపూర్‌లో11.2,నిర్మల్ రూల ర్‌లో 12.4, పెంబి మండలంలో 31.02. మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. వర్షాలకు తోడు బలమైన గాలులు వేయడంతో నర్సాపూర్ మండల కేంద్రంలో చెట్టు కొమ్మలు రోడ్లపై విరిగిపడి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. మామడ మండల కేంద్రంలో నరసయ్య అనే వ్యక్తికి చెందిన పాత కూన ఇల్లు కూలిపోగా ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. రోళ్ళపై ఆరబోసిన వరి జొన్న పంటలు తడిసిపోవడంతో రైతులు పంటలు కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడ్డారు.



- సహజ సిద్ధమైన నీటిని అందించే మట్టి కుండ
- ఆదిలాబాద్ రంజన్‌లకు నేటికి తగ్గని డిమాండ్
- వేసవి వచ్చిందంటే ప్రతి ఇంట్లో ఉండాల్సిందే
- దాహార్తి తీరాలంటే మట్టికుండ నీరు తగాల్సిందే
- పేదోడి ఫ్రిడ్జ్‌గా ఖ్యాతి.. 100 శాతం ప్యూరి ఫైర్
- మట్టి కుండతో వేసవిలో విద్యుత్ ఆదా
- చెమటోడుస్తున్నా గిట్టుబాటు లేదు
- కుల వృత్తిని వదులుకోలేక, గిట్టుబాటుకాకున్న కుండలను తయారు చేస్తున్న కుమ్మరులు



# మట్టికుండ సల్లంగుండ

## అమృతధార.. మట్టికుండ నీరు

రాష్ట్రంలోనే ఆదిలాబాద్ జిల్లా రంజన్‌లకు పెట్టింది పేరు.. ఇక్కడ తయారు చేసిన రంజన్‌లకు రాష్ట్ర వ్యాప్తంగా మంచి గిరాకీ ఉంటుంది.. నాణ్యత విషయంలో రాజీపడకుండా నాణ్యమైన మట్టితో ఇక్కడి రంజన్‌లు, కుండలను తయారు చేస్తారు కుమ్మరులు.. ఇక వేసవి వచ్చిందంటే చాలు ప్రతీ ఇంట్లో కుండ ఉండాల్సిందే. పల్లె నుండి నగరం వరకు ఏదైనా కావచ్చు వంటింట్లో మట్టి కుండకు వేసవిలో ప్రత్యేక స్థానం ఉంటుంది. సహజ సిద్ధంగా నీటిని చల్లబర్చే గుణం మట్టి కుండది. మట్టి కుండ, రంజన్ తయారీ కోసం కుమ్మరులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. మట్టి కుండలో ఉన్న అతి సూక్ష్మ రంధ్రాల గుండా గాలి కుండలోకి దూరి అందులోని నీటిని సహజసిద్ధంగా, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా చల్లబర్చుతుంది. అంతేకాక అందులోని నీరు నేచురల్‌గా 100 శాతం ప్యూరి ఫైర్‌గా మారుతుంది. ఫలితంగా ఆరోగ్యంతో పాటు వేసవిలో తీరని దాహార్తి.. మట్టి కుండలోని నీటిని సేవిస్తే ఇట్టే తీరిపోవడం ఈ కుండ స్పెషాలిటీ. అందుకే మట్టి కుండని ఆధునిక యుగంలో అమృత ధారగా పిలుచుకుంటారు. అయితే ప్రస్తుతం ఆశించినంతగా లాభాలు రావడం లేదని, కుల వృత్తిని వదులుకోలేక.. కుండులు తయారీ చేస్తున్నామని కుమ్మరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఇచ్చోడ, మే 27 (ప్రభాత సమాచారం)**
జిల్లాలోని పలు గ్రామాల్లో వేసవి కాలంలో రంజన్‌లు, మట్టి కుండల తయారీ అధికంగా కొనసాగిస్తారు. వేసవి కాలంలో మట్టికుండల తయారీ అధికంగా ఉంటుందని, కొన్ని సార్లు లాభాలు వస్తాయని, ఆధునిక కాలంలో మారుతున్న జీవ నశైలితో ప్రస్తుతం ఆశించిన మేర లాభాలు రావడం లేదని కుమ్మరులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు ఆదిలాబాద్ జిల్లా రంజన్‌లు, కుండలు అంటే పెట్టింది పేరని, ఇక్కడ రంజన్‌లు, కుండలను వేసవికి ముందుగానే పెద్ద మొత్తంలో తయారు చేయించుకొని ఇరత రాష్ట్రాల్లో విక్రయించే వారని కానీ నేడు పూర్తిగా తగ్గిపోయిందని ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. ఇక వేసవి కాలంలో మట్టి కుండలోని మంచినీరు తాగడం వల్ల వేసవి తీవ్రత నుంచి వెంటనే ఉపశమనం పొందేందుకు అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. సామాన్యుడి మొదలు ధనికుల వర కు వేసవికాలంలో మట్టికుండలపై ఆసక్తి చూపుతారు. ఒక్కో కుండ రూ. 200 నుండి రూ.250 వరకు విక్రయిస్తున్నారు. మట్టికుండలను నాణ్యత ప్రమాణాలతో తయారు చేస్తామని నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదంటున్నారు. ప్రభు త్వం ఆర్థికంగా సహకరిస్తే మరింత ఉత్పత్తులు చేసేందుకు అవకాశం ఉంటుందని, ప్రభుత్వం కులవృత్తులకు కేటాయిం చిన బడ్జెట్‌లోని నిధులను తయారు చేయు పరికరాల కొను గోలుకు రుణం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



**100 శాతం ప్యూరి ఫైర్...**

శరీరంలో మిటాలిజం రేటును జీర్ణశక్తిని పెంచి, కొవ్వును నియంత్రించడంలో మట్టి కుండలోని నీరు దోహదపడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. మట్టి కుండలో నీరును నిల్వ చేయడం మూలాన నీటిలోని మలినాలను బ్యాక్టీరియా, ఫంగస్‌ను వేరు చేసి సహజసిద్ధమైన తాగునీటిని అందిస్తుంది. మట్టి కుండలోని నీటిని నిత్యం సేవించడం ద్వారా ఉదర సంబంధిత వ్యాధులను తగ్గించి, అజీర్తి, అసిడిటి సమస్యలను అరికడుతుంది. అదే విధంగా మట్టి కుండలోని నీరు సహజసిద్ధ పరిస్థితుల్లో చల్ల బడటం కారణంగా ఇమ్యూనిటీ గుణాలు అధికంగా లభించడంతో పాటు వేసవిలో వచ్చే సన్‌స్ట్రోక్‌ను మట్టి కుండ నీరు నివారిస్తుంది. మట్టికుండలో నిల్వచేసిన నీళ్లు సేవించడం అమృతప్రాయమని పెద్దలు అభివర్ణిస్తుంటారు.

**సహజంగా చల్లబరుస్తుంది..**

కుండలో నీళ్లు సహజంగాచల్లగా మారుతాయి. బంక మట్టితో, ప్రత్యేక కళతో కుమ్మరులు మట్టికుండను తయారు చేస్తారు. తయారు చేసే క్రమంలో సహజ సిద్ధం గా మట్టి కుండకు అతి సూక్ష్మ రంధ్రాలు ఏర్పడుతాయి. ఫలితంగా అందులో నీరు నిల్వ చేయడం కారణంగా అతి సూక్ష్మ రంధ్రాల నుండి గాలి, కనిపించని వెలుతురుదూరి నీటిని స్వచ్ఛంగా, చల్ల బర్చుతాయి. దీంతో నీటిలో ప్రత్యేక గుణాలు చేరి తాగడానికి అతి స్వచ్ఛతగా మారుతాయి. నీరు సహజ సిద్ధంగా చల్లబడటం కారణంగా వేసవిలో మట్టి కుండ నీరు సేవించిన వారు వేసవి తాపం నుండి ఇట్టే బయటపడతారు. ఇక మట్టి కుండ నీరు వాడటం వల్ల కొంతమేర విద్యుత్ ఆదా చేయవచ్చు. ఫలితంగా కరెంట్ కోత సమస్యలున్నా చల్లని నీరు సేవించవచ్చు. కాస్ట్ ఏ పెక్టెడ్, ఏకో ఫ్రెండ్లీ కాబట్టి వేసవిలో మట్టికుండలోని నీరు తాగడం ఎంతో ఆరోగ్య కరమని నిపుణులు చెబుతున్నారు.





**ఇమ్యూనిటీ గుణాలు అధికం..**

మట్టికుండలో నీళ్లు తాగడం వల్ల నీళ్లలోని సహజ మినరల్స్, ఎలక్ట్రోలైట్స్ కోల్పోకుండా మట్టికుండ కాపా డుతుంది. స్వచ్ఛమైన నీటిని శరీరానికి అందడం కారణంగా శరీరం డీహైడ్రేడ్ కాకుండా శక్తి పెంపొందింప బడుతుంది. మట్టికుండలో నీటిలో ఇమ్యూనిటీ గుణాలు కూడా అధికం, ఈ నీరు తాగడం వలన అలసట కూడా దరిచేరదు.

**ఆల్కలైన్ నేచర్..**

అసిడిటి పరిస్థితుల్లో వ్యాధులు ఎక్కువగా వ్యాప్తి చెందుతాయి. అల్కలైన్ కంటే మరింత ఎక్కువగా శరీరం ఎసిడిటికి గురి ఉవుతుంది. దాంతో ఆరోగ్యం ప్రమాదకర స్థితి చేరుకుంటుంది. మట్టితో తయారు చేసిన కుండలోని నీరు తాగడం వల్ల నేచురల్‌గా, ఆల్కలైన్ పొందుతారు. దీనికి ముఖ్య కారణం మట్టిలో ఖనిజ లవనాలకు తోడు మట్టి కుండ నుండి నిత్యం ఆక్సిజన్ కుండలోనికి ప్రసరించడం కారణంగా ఖనిజ లవనాలకు ఆక్సిజన్ తోడై వాటికి జీవం మరింత పెరుగుతుంది. ఫలితంగా కుండలోని నీరు తీసుకుంటే శరీరానికి ఉపయోగపడే మంచి ఆల్కలైన్ నీరు రూపాంతరం చెంది మనకు అందుతుంది. ఇక ఇందులో ఎటువంటి హానికర కెమికల్స్ ఉండవు కాబట్టి, సన్‌స్ట్రోక్ నుండి తప్పించుకోవచ్చు. జలుబు, దగ్గు, అస్మాతో బాధపడే వారికి ఫ్రీజ్ నీటి కంటే మట్టికొండలోని నీరు శ్రేష్టమని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. శీతోష్ణస్థితులకు అనుగుణంగా మట్టికుండ దాని స్వభావం మారుతుంది. జీర్ణశక్తిని పెంచి, కొవ్వును కూడా నియంత్రిస్తుంది.



### లాభాలు ఆశించినంత రావడం లేదు..

వేసవిలో తప్ప మిగతకాలంలో వ్యాపారం జరగదు. ఇతర కాలంలో పెళ్లిళ్లు, ఇతర కార్యక్రమాలు ఎప్పుడొస్తాయా అని ఎదురు చూసే పరిస్థితి.. మట్టి కుండాలపై ప్రజలకు అవగాహన పెరిగితే అన్ని కాలాల్లో వాడుతారు. స్వయంగా తయారు చేసి విక్రయిస్తం. సైజును బట్టి 150 రూపాయల నుండి 250 రూపాయలు, పెద్దసైజు రంజన్ లైతే 400 వరకు విక్రయిస్తున్నాం. రోజుకు 4 వేల నుండి 5 వేల వరకు వ్యాపారం సాగుతుంది. కొన్ని రంధ్రాలు, రవాణాలో పగిలిపోవడం కారణంగా కొంత నష్టం ఏర్పడుతుంది. మా వృత్తి ఇదే కాబట్టి దీనిని వదులుకోలేము.. నష్టాలు వచ్చినా మా కళను చంపుకోలేము.

**-చంద్రమోహన్**

### ఫ్రిడ్జుల మీద మోజుతో గిరాకి అంతంత మాత్రమే..

ప్రజలకు ఫ్రీడ్జ్‌లపై ఉన్న ద్యాస మట్టికుండలపై



ఉండడం లేదు. ఆదరణ కరువు కావడంతో గిరాఖి అంతంత మాత్రంగానే సాగుతుంది. వారం రోజులుగా ఎండ దంచి కొట్టడంతో ఇప్పుడిప్పుడే కొనుక్కు పోతుండ్రు. రోజుకు వేయి రూపాయల గిరాకీ అయితే మా గొప్ప.

**-విమలబాయి**



## నువ్వు నన్ను ఏం చేయలేవు..

అర్జున్ రెడ్డి , యానిమల్ సినిమాలతో ఒక్కసారిగా ఇండస్ట్రీని సందీప్ వంగా షేక్ చేశాడు. ఈ రెండు సినిమాలు బ్లాక్ బస్టర్ కావడంతో పాటు భారీ కలెక్షన్లు రాబట్టడంతో పాటు వాటి మీద అంతే విమర్శలు కూడా వచ్చాయి. అయితే సందీప్ వంగా ప్రస్తుతం ప్రభాస్‌తో స్పిరిట్ మూవీ చేస్తున్నాడు. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ కూడా ప్రారంభం కానుంది. ఈ క్రమంలో ఈ సినిమాకి హీరోయిన్‌ను ఫిక్స్ చేశారు. స్పిరిట్ మూవీలో దీపికా పదుకోణెను ముందు హీరోయిన్‌గా ఫిక్స్ చేశారు. కానీ ఇప్పుడు యానిమల్ ఫేమ్ త్రిప్తి డిమ్రీను హీరోయిన్‌గా ఎంపిక చేసినట్లు సందీప్ వంగా ప్రకటించాడు. అయితే దీపికా ఎక్కువ కండీషన్లు పెట్టడం వల్ల దీపికాను వద్దని త్రిప్తి డిమ్రీను తీసుకున్నట్లు సమాచారం. సందీప్ వంగా సినిమాలు అంటే ఎ రేటెడ్ సీన్లు ఉంటాయి. సందీప్ వంగా అన్ ప్రొఫెషనల్ అని అందుకే మూవీ నుంచి తప్పకున్నట్లు దీపికా పీఆర్ టీం ప్రచారం చేస్తున్నట్లు తెలుస్తోంది. వీటిపై సందీప్ వంగా గట్టిగానే స్పందించాడు. డైరెక్ట్‌గా దీపికాకు ఓపెన్ ఛాలెంజ్ చేశాడు. సందీప్ వంగా దీపికా పేరు పెట్టకుండా సోషల్ మీడియా ద్వారా గట్టి కౌంటర్ ఇచ్చాడు. తాను ఒక ఆర్టిస్టుకు కథ చెప్తే తప్పకుండా సినిమా చేస్తానని అర్థం. కానీ ఆ వ్యక్తి కథను పూర్తిగా బయట పెట్టే తన స్వభావాన్ని చాటి చెప్పారని ట్వీట్ చేశారు. కేవలం కథను బయట పెట్టడమే కాకుండా యంగ్ యాక్టర్‌ను తక్కువ చేయడం ఫెమినిజమా అని అన్నాడు. ఏళ్ల తరబడి ఒక సినిమా కోసం కష్టపడతామని, తన ప్రపంచం సినిమా అని, ఈ విషయం మీకు ఎప్పటికీ అర్థం కాదన్నాడు. తన మొత్తం కథను బయట పెట్టేసిన కూడా పర్లేదని, తనకి పోయేది ఏం లేదని.. 'డర్టీ పీఆర్ గేమ్స్' అనే హ్యాష్‌ట్యాగ్స్ కూడా యాడ్ చేశారు. అయితే దీపికను ఉద్దేశించే ఈ ట్వీట్ చేసినట్లు అందరికీ కూడా అర్థమైపోయింది. దీంతో నెటిజన్లు దీపికా పీఆర్ టీంపై మండిపడుతున్నారు.



## ‘అది దా సర్‌ప్రైజ్’ బ్యూటీకి బంపరాఫర్..

యంగ్ హీరోయిన్ కేతిక శర్మ వరుస సినిమాలతో బిజీ బిజీగా మారిపోయింది. ప్రస్తుతం ఈ బ్యూటీ ఫుల్ ఫామ్‌లో ఉంది. ఢిల్లీకి చెందిన ఈ అందాల భామ కేతిక శర్మ పూరీ జగన్నాథ్ తెరకెక్కించిన 'రొమాంటిక్' మూవీతో హీరోయిన్‌గా టాలీవుడ్‌కు ఎంట్రీ ఇచ్చింది. పూరీ జగన్నాథ్ కొడుకు ఆకాష్ పూరీతో జంటగా నటించింది. ఇందులో ఆకాష్‌తో కలిసి లిప్ లాక్ సీన్స్‌లో రెచ్చిపోయింది. అయితే ఈ సినిమా తర్వాత ఆమెకు పెద్దగా అవకాశాలు రాలేదు. ఇక ఇప్పుడిప్పుడే కేతిక వరుస సినిమాలను లైన్‌లో పెట్టేస్తుంది. వచ్చిన అవకాశాలను బాగా వినియోగించుకుంటుంది. ఓ వైపు హీరోయిన్‌గా మరోవైపు ఐటెం సాంగ్‌లతో బిజీ బిజీ అయిపోయింది. ఇటీవల నితిన్ నటించిన 'రాబిన్ హుడ్' సినిమాలో 'అదిదా సర్‌ప్రైజ్' పాటతో రెచ్చిపోయింది. ఈ సాంగ్‌లో రొమాంటిక్ లుక్స్‌తో కుర్రకారును ఓ ఊపు ఊపేసింది. ఈ సాంగ్‌తో మరింత క్రేజ్ సంపాదించుకుంది. అదే సమయంలో మరో సినిమా ఆఫర్ కొట్టేసింది. టాలీవుడ్ స్టార్ హీరోతో రొమాన్స్ చేసేందుకు సిద్ధమైంది. ఆ స్టార్ హీరో మరెవరో కాదు మాస్ మహారాజ్ రవితేజ. ప్రస్తుతం రవితేజ హిట్లు ఫ్లాపులతో సంబంధం లేకుండా వరుస సినిమాలతో దూసుకుపోతున్నాడు. ఇప్పుడు 'మాస్ జాతర' అనే సినిమా చేస్తున్నాడు. దీని తర్వాత కిషోర్ తిరుమల డైరెక్షన్‌లో మరో చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడు. ఇందులో ఇద్దరు హీరోయిన్‌లకు ఛాన్స్ ఉండగా.. అందులో కేతిక శర్మను ఖరారు చేసినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి మేకర్స్ ఇప్పటికే ఆమెను సంప్రదించినట్లు సమాచారం. అంతేకాకుండా ఈ చిత్రానికి 'అనార్కలి' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

## మంచు విష్ణుకు కోలుకోలేని దెబ్బ..



మంచు విష్ణుకు గట్టి షాక్ తగిలింది. మరికొద్ది రోజుల్లో 'కన్నప్ప' రిలీజ్ కానుండగా.. దానికి సంబంధించిన హార్డ్ డ్రైవ్ మిస్ అయింది. దీంతో ఫిలిం నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. ఈ మేరకు తమ అనుమతి లేకుండా హార్డ్ డ్రైవ్ తీసుకెళ్లినట్లు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ పోలీసులకు కంప్లైంట్ ఇచ్చారు. ఇప్పుడిదే వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమా ప్రారంభమైనప్పటి నుంచి ఏదో ఒక షాక్ తగులుతూనే ఉంది. ముఖ్యంగా నటుడు మంచు విష్ణుపై ట్రోల్స్, మీమ్స్ ఓ రేంజ్‌లో వైరల్ అవుతున్నాయి. అతడిపై తరచూ ఏదో ఒక మీమ్స్ వైరల్ అవుతూనే ఉంటుంది. ఇందులో భాగంగానే తాజాగా మంచు విష్ణుకి పెద్ద దెబ్బే తగిలింది. కన్నప్ప మూవీపై బజ్ తెచ్చేందుకు మంచు విష్ణు విదేశాల్లో సైతం ప్రమోషన్స్ చేస్తూ వచ్చాడు. త్వరలోనే ఈ చిత్రం విడుదల కానుంది. ఈ నేపథ్యంలో కన్నప్ప మూవీకి సంబంధించిన విలువైన సమాచారంతో కూడిన హార్డ్ డ్రైవ్ మాయం కావడంతో విష్ణుకి గట్టి షాక్ తగిలింది. ఒకవేళ హార్డ్ డ్రైవ్‌లో ఉన్న సమాచారం మొత్తం బయటకు వస్తే మంచు విష్ణు 'కన్నప్ప' చిత్రానికి ఎవరూ ఊహించని షాక్ తగలనున్నట్లు తెలుస్తోంది. ఎందుకంటే ఈ చిత్రం మొదలైనపుడు బడ్జెట్ రూ.100 కోట్లే అని అన్నారు. కానీ రిలీజ్ టైంకి లెక్క రూ.200 కోట్లు దాటిపోతోందని ఇటీవల మంచు విష్ణు ఓ సందర్భంలో తెలిపాడు. అందువల్ల ఈ సినిమాకి సంబంధించిన డ్రైవ్‌లోని సమాచారం బయటకు వస్తే.. నష్టాల్లో కూరుకుపోవడం ఖాయమనే గుసగుసలు వినిపిస్తున్నాయి. గతంలో పవన్ కళ్యాణ్ నటించిన 'అత్తారింటికి దారేది' సినిమా నుంచి కూడా ఓ సాంగ్ మొత్తం లీక్ అయి సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. ఇప్పుడు మంచు విష్ణు 'కన్నప్ప' మూవీకి సంబంధించి ఏకంగా హార్డ్ డ్రైవ్ మిస్ కావడంతో చిత్రబృందంలో టెన్షన్ మొదలైంది. చూడాలి మరి చివరికి ఏం జరుగుతుందో.



## బ్రౌన్ డ్రెస్‌లో హాట్ లుక్స్‌లో సమంత..

హీరోయిన్ సమంత వోగ్ బ్యూటీ అవార్డ్స్ 2025లో భాగంగా బ్రౌన్ కలర్‌లో ఫిట్‌గా ఉండే డ్రెస్ ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంది. సైడ్‌లో జిగ్ జాగ్ షేప్‌లో ఉన్న ఈ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. వీటిని చూసి నెటిజన్లు సామ్ ఈజ్ బ్యాక్ అంటూ కామెంట్లు చేస్తున్నారు.
హీరోయిన్ సమంత వోగ్ బ్యూటీ అవార్డ్స్ 2025లో భాగంగా బ్రౌన్ కలర్‌లో ఫిట్‌గా ఉండే డ్రెస్ ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంది. సైడ్‌లో జిగ్ జాగ్ షేప్‌లో ఉన్న ఈ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. వీటిని చూసి నెటిజన్లు సామ్ ఈజ్ బ్యాక్ అంటూ కామెంట్లు చేస్తున్నారు.







# పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

- దశలవారీగా అందరికీ ఇందిరమ్మ ఇండ్లు
- మొదటి విడతలో ఇండ్లు లేని నిరుపేదలకే అవకాశం
- పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక
- బ్రాహ్మణగావ్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు చర్యలు
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క వెల్లడి



**ముథోల్, మే 27 (ప్రభాత సమాచారం)**

ఇండ్లు లేని నిరుపేదలందరికీ సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డి.అనసూయ సీతక్క స్పష్టం చేశారు. మంగళవారం ముథో ల్ మండలం బ్రాహ్మణగావ్‌లో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభోత్సవం, పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనల కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అభిలాష అభినవ్ మంత్రి సీతక్కకు పూల మొక్కను అందించి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్, ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించి, భవనంలోని గదులను పరిశీలించారు. ప్లాస్టిక్ నిర్మూలనకు చర్యగా ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంకును ప్రారంభించారు. అనంతరం దౌనెల్లి నుండి మహారాష్ట్ర సరిహద్దు వరకు, తానూర్ బిటి రోడ్డు, ఇతర అభివృద్ధి పనులకుగాను శిలాఫలకాలు ఆవిష్కరించారు. అనంతరం రైతు వేదికలో ఏర్పాటు చేసి న బహిరంగ సభలో మంత్రి సీతక్క మాట్లాడుతూ.. దాదాపు రూ.20 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరగడం సంతోషకరమన్నారు. ఇందులో భాగంగా రూ.20 లక్షలతో గ్రామపంచాయతీ భవనం, రూ.1.90 కోట్లతో కుంటాలదౌనెల్లి బీటీ రోడ్, రూ.5.90 కోట్లతో తానూర్‌హుండా బీటీ రోడ్ రినివల్, రూ.10 కోట్లతో ముథోల్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేసినట్లు తెలిపారు. బ్రాహ్మణగావ్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మొదటి విడతలో ఇండ్లు లేని నిరుపేదులను గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు అందిస్తున్నామని, తదుపరి దశలవారీగా అందరికీ ఇండ్లు కల్పిస్తామని చెప్పారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరిగిందని, ఎవరికైనా అనర్హులకు ఇండ్లు మంజూ రైనట్టు అనుమానం ఉంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, జిల్లాలో రూ.20 కోట్ల విలువైన అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ప్రతి నియోజక వర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు కేటాయించబడ్డాయని, అర్హులైన నిరుపేదలందరికీ విడతలవారీగా ఇండ్లు అందజేస్తామన్నారు. అనంతరం పలువురు ఇందిరమ్మ ఇండ్ల మహిళా లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఎమ్మెల్యే రామారావు పటేల్, వెడ్మ బొజ్జు పటేల్, భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

**మాజీ సర్పంచ్ ను అభినందిచిన మంత్రి...**

గ్రామపంచాయతీ భవనం విశాలమైన స్థలంలో ప్రభుత్వం నిధులతో సకాలంలో నిర్మించినందుకు మాజీ సర్పంచ్ రాంరెడ్డి ని జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క అభినందించారు. ముథోల్ మండలంలోని బ్రహ్మాన్ గాం గ్రామంలో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనం ను మంత్రి మంగళవారం ప్రారంబించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే విఠల్ రేడ్డి మాజీ సర్పంచ్ రాంరెడ్డి ని పరిచయం చేశారు. సర్పంచ్ పదవి అయిపోయినప్పటికి పంచాయతీ కార్యాలయం నిర్మించారని చెప్పారు. దీంతో మాజీ సర్పంచ్ ను మంత్రి  అబినందించారు.

**వర్షంలో బందోబస్తు పరిశీలించిన ఎస్పీ..**

ముథోల్  నియోజకవర్గంలో మంగళవారం మంత్రి సీతక్క పర్యటన సందర్భంగా నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల బందోబస్తును స్వయంగా పరిశీలించారు. మండలంలోని బ్రహ్మణ్‌గావ్ గ్రామంలో మంత్రి పంచాయతీ భవన ప్రారంభోత్సవానికి వచ్చిన నేపథ్యంలో ఎస్పీ బందోబస్తు





వివరాలను ముథోల్ సిఐ మల్లేష్, ఎస్సై సంజీవ్‌ను అడిగి తెలుసుకున్నారు. వర్షంలోనే బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. మంత్రి పర్యటనలో  ఏలాంటి ఇబ్బం దులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఎస్పీ సూచించారు. ఇటీవల మంత్రి పొంగులేటి పర్యటన సందర్భంగా కుంటాల మండలంలో బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేయడం చర్చనీయాంశమైంది. దీంతో ఇలాంటి సంఘటనలను  పునరావృతం కాకుండా మంత్రి పర్యటనలో భాగంగా జిల్లా ఎస్పీ ముందస్తు చర్యలు తీసుకున్నారు. బందోబస్తులో భాగంగా మంత్రి వచ్చే రూట్లలో ఆయా గ్రామాల వద్ద ముందుగానే పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్, బిజెపి కార్యకర్తలను మంగళవారం ఉదయం ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఆనంతరం వారిని సొంత పూచికత్తుపై వదిలిపెట్టారు.

**అధికారుల ఉరుకులు.. పరుగులు..**

లోకేశ్వరం మండల కేంద్రంలో కొమురం భీం విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరయ్యేందుకు రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క ఏ రూటు నుండి వస్తున్నారో తెలియక అధికార యంత్రాంగం అయోమయానికి గురయ్యారు. మండలానికి ప్రవేశించే మూడు రూట్ల వైపు అధికారులు పరుగులు తీయడం కనిపించింది. ముందుగా నిజామాబాద్ నుంచి పంచ గుడి మార్గంలో వస్తున్నారని సమాచారం ఉండడంతో నిజామాబాద్ సరిహద్దులో గల గోదావరినదిపై గల బ్రిడ్జి వద్దకు అధికారులు వెళ్లారు. ఆ తర్వాత నిర్మల్ నుండి అర్లీ ఎక్స్ రోడ్ ద్వారా వస్తున్నట్లు సమాచారం అందడంతో అధికారులు అక్కడి వరకు వెళ్లారు. చివరకు దేగాం నుండి పుస్పూర్ మార్గంలో వస్తున్నట్లు సమాచారం అందడంతో అటువైపు కూడా పరుగులు తీశారు. 11:00 లకు లోకేశ్వరం కి రావాల్సి ఉండగా 11:45 నిమిషాల వరకు రాలేకపోయారు. దీనితో అధికారులు మంత్రి ఏ వైపు నుండి వస్తున్నారోనని ఆతృతతో ఎదురుచూడడం కనిపించింది.













# విస్తరిస్తున్న నైరుతి జోరు వాన

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షాలు
- రుతుపవనాలకు తోడు బంగాళాఖాతంలో ఆవర్తనం
- ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో దంచికొట్టిన వాన
- జిల్లా కేంద్రంలో పలు కాలనీలు జలమయం
- ఇండ్లు, వ్యాపార సముదాయాల్లోకి వర్షం నీరు
- ఉప్పొంగిన ఎర్రవాగు.. ఆరు గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు
- కొనుగోలు కేంద్రాల్లో మళ్లీ తడిసిన ధాన్యం
- రైతులకు తప్పని తిప్పలు
- జలపాతాలకు కొత్తశోభ
- ప్రాజెక్టుల్లోకి స్వల్పంగా చేరుతున్న నీరు
- మరో రెండు రోజులు ఇదే పరిస్థితి
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కంట్రోల్ రూంల ఏర్పాటు




(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)

నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయి. మరోవైపు అల్పపీడనం సైతం కొనసా గుతోంది. వీటి ప్రభావంతో జిల్లాలో పలు మండలాల్లో మంగళవారం ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఆదిలాబాద్‌లో మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వాన మొదలైంది. గంటన్నర పాటు ఏకధాటిగా కురవడంతో పట్టణంలోని రోడ్లన్నీ జలమయయ్యాయి. అంబేద్కర్ చౌక్, పంజాబ్ చౌక్‌తో పాటు రాంనగర్ లోని రహదారిపై భారీగా వర్షపు నీరు నిలిచింది. వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. వికలాంగుల కాలనీలో వరదనీరు ఇళ్లలోకి చేరింది. జైనథ్‌లోనూ లోతట్టుప్రాంతాలు జలమయమయ్యాయి. ఇంద్రవెల్లి, బోథ్, భీంపూర్, బజార్ హత్నూర్, ఉట్నూర్‌లో



సాధారణ వర్షపాతం నమోదు కాగా మిగతా మండలాల్లో మోస్తారు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఇంద్రవెల్లి, గాదిగూడ మండలాల్లో కురిసిన వర్షానికి ఇంటపైకప్పులు లేచిపోయాయి. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొన్ని చోట్ల చెట్లు విరిగిపడగా, స్తంభాలు నెలకొరిగాయి. పొల్లుగూడలోని పెర్సపేన్ ఆలయంపై పిడుగు పడింది. జొన్నల కొనుగోలు కేంద్రాల్లో విక్రయానికి తీసుకు వచ్చిన ధాన్యాన్ని కాపాడుకునేం దుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కాగా మరో రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లు సూచించారు.

**ఇచ్చోడలో కుండపోత వాన...**

**ఇచ్చోడ :** మండల కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. దీంతో కాలనీల్లో వర్షం నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కుండపోత వర్షం ఏకధాటిగా గంట పాటు కురువడంతో వ్యాపారం చేసుకునే దుకాణాల్లో అధిక మొత్తంలో వర్షం నీరు, డ్రైనేజి నీళ్లు చేరి ఇబ్బందులకు గురయ్యారు. చాలా వరకు దుకాణం సముదాయలాన్ని వర్షం నీటితో తడిసి పోవడంతో ఆర్థికంగా కొంత నష్టం వాటిల్లింది.

**ఉట్నూర్‌లో దంచి కొట్టినవాన...**

**ఉట్నూర్ :** అల్పపీడనం ప్రభావంతో ఉట్నూర్ మండలంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. ఉదయం జోరుగా ఎండ ఉండగా మధ్యాహ్నం సమయంలో ఆకాశం మెగావృతమై వాతావరణం చల్లబడింది. వర్షం పడే సమయంలో ఆకాశం కారుమబ్బులతో ఒకసారిగా చీకటిమయంగా మారింది. మండలంతో పాటు దంతన్‌పల్లి, బీర్సాయిపేట్, హస్నాపూర్, శ్యాంపూర్, పులిమడుగు తదితర గ్రామాల్లో వర్షం పడింది. వర్షంతో జనాలు ఇబ్బంది పడ్డారు. ఉరుములు మెరుపులతో వర్షం పడడంతో జనాలు ఆందోళనకు గుర్రైయ్యారు. ఉక్కపోతతో ఇబ్బంది పడ్డ జనాలు వర్షంతో కాస్త ఉపశమనం లభించింది. వర్షాలు పడుతుండడంతో రైతులు ఖరీఫ్‌లో విత్తనాలు విత్తుకునేందుకు సిద్ధం అవుతున్నారు.

**కుభీర్ మండలంలో తడిసిన జొన్న...**

**కుభీర్ :** కుభీర్ మండలం కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం వర్షం దంచికొట్టింది. దీంతో జొన్నల కొనుగోలు కేంద్రానికి వాహనాలలో పంటను తీసుకు వచ్చిన రైతులు తీవ్ర అవస్థలు పడ్డారు. వర్షానికి వాహనాల్లోని పంట తడుస్తుందని రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. అమ్మకానికి చివరి రెండు రోజులు కావడంతో వాహనాలు భారీగా తరలి వచ్చాయి. మార్కెట్ యార్డు జొన్నల బస్తాలతో నిండుకొని ఉంది. బస్తాలను తరలించడానికి వాహనాలు వస్తే కానీ, కొనుగోలు ప్రారంభించే పరిస్థితి లేదు. ఒక రోజులో ఖాళీ అవుతాయి అనుకుని తీసుకు వచ్చిన రైతులకు నిరాశ మిగిల్చింది. వాహనాల అద్దె తడిసి మోపెడతు న్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం చివరి రోజు కావడంతో మరిన్ని వాహనాలు వచ్చే అవకాశం ఉంది.

**జొన్న రైతుల ఆందోళన...**

**ఆసిఫాబాద్ :** జైనూర్ మండలంలో జొన్న రైతులు ఆందోళనకు దిగారు. మంగళవారం ఉదయం జైనూర్‌లో పీఏసీఎం వ్యవసాయ మార్కెట్‌లోని జొన్న కోనుగోలు కేంద్రానికి రైతులు వచ్చారు. కోనుగోలు కేంద్రం తెరవక పోవడం.. రైతులు ఉదయం నుంచి అక్కడే పడిగాపులు కాస్తున్నారు. రైతులకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా కోనుగోలు నిలిపివేయడంతో అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 50 బోలేరో వాహనాలతో కొనుగోలు కేంద్రం ఎదుట రైతులు ఆందోళన నిర్వ హించారు. వెంటనే జొన్న కోనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# డుడ్..డుడ్..డుడ్.. బుల్లెట్ బండి చప్పుడు చేస్తే బెండు తీస్తరు





- మాడిఫైడ్ సైలెన్సర్ పెడితే కేసుల నమోదు
- సౌండ్ పొల్యూషన్ సైలెన్సర్‌లు వాడితే చర్యలు..
- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరిక

**ఆదిలాబాద్, మే 27 (ప్రభాత సమాచారం)**

డుడ్...డుడ్...డుడ్....డుడ్....పట్...పట్...పట్...పట్... అంటూ భారీ శబ్దాలు చేసే ద్విచక్ర వాహనాదారులపై ఇక నుండి పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. సౌండ్ పొల్యూషన్‌కు కారణమైన అధిక శబ్దంతో వెళ్తున్న ద్విచక్ర వాహనాలపై ఆదిలాబాద్ పోలీసులు కొరడా ఝులిపించారు. ఇటీవల స్పెషల్ డ్రైవ్ చేపట్టి బుల్లెట్, ఇతర ద్విచక్ర వాహనాలకు బిగించిన మాడిఫైడ్ సైలెన్సర్లను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో ట్రిఫిక్ పోలీస్ స్టేషన్ ఎదుట మారు 160 మాడిఫైడ్ సైలెన్సర్లను రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. బుల్లెట్ వాహనాలకు మాడిఫైడ్ సైలెన్సర్లు పెట్టిన వారిపై ఇక నుండి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సైలెన్సర్లను బిగించిన మెకానికల్‌పై సైతం కేసులు నమోదు చేస్తామని వెల్లడించారు. మాడిఫైడ్ సైలెన్సర్ల వల్ల వృద్ధులకు, చిన్నపిల్లలకు భారీ శబ్దంతో గుండె సమస్యలు ఏర్పడతాయని తెలిపారు. మాడఫైడ్ సైలెన్సర్లు పెట్టిన వారిపై పర్యావరణ పరిరక్షణ చట్టం కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. యువత ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా మోడిఫైడ్ సైలెన్సర్లను బిగించకూడదని సూచించారు. ఎవరైనా నిబంధలను ఉల్లంఘిస్తే చట్ట రీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో డీఎస్పీ జీవన్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ ప్రణయ్ కుమార్, సీఐలు సునీల్ కుమార్, కరుణాకర్ రావు, ఎస్.ఐ మహేందర్, దేవేందర్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా శనీశ్వర జయంతి

**ఆసిఫాబాద్, మే 27 (ప్రభాత సమాచారం)**

రెబ్బెన మండలం ఇందిరానగర్ గ్రామంలోని శ్రీ కనక దుర్గాదేవి స్వయంభూ శ్రీమహంకాళీ దేవస్థానంలో శనీశ్వర జయంతి వేడుకలను మంగళవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. శనీశ్వర స్వామికి భక్తులు తైలాభిషేకాలు చేసి నైవేద్యాలు సమర్పించి హారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. జిల్లాలోని శనీశ్వర స్వామి ఏకైక ఆలయం కావడంతో చుట్టూ ప్రక్కల నుంచి భక్తులు వేకువ జామునే తరలివచ్చి అమ్మవారిని శనీశ్వర, కాలభైరవ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు మోడెమ్ తిరుపతి గౌడ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అందుబాటులో 14.26 లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు

**ఆదిలాబాద్, మే 27 (ప్రభాత సమాచారం)**

జిల్లాలోని 316 విత్తన దుకాణాల్లో పలు కంపెనీలకు చెందిన 14, 26,220 హైబ్రిడ్ పత్తి విత్తన ప్యాకెట్లను అం దుబాటులో ఉంచినట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. రైతులు సమీప డీలర్ వద్ద విత్తనాలు కొనే సమయంలో విధిగా రశీదు పొంది, పంటకాలం పూర్తి అయ్యే వరకు భద్రపర్చుకోవాలన్నారు. నకిలీ విత్తనాల విక్రయాలకు సంబంధించి ఏదైనా సమాచారం ఉంటే టాస్క్ పోర్సు సీఐ చంద్ర మౌళి 87126 59965, ఏడీఏ కె.శివకుమార్ 8977742854 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీని జాతిపితగా ప్రకటించాలి

**ఆసిఫాబాద్, మే 27 (ప్రభాత సమాచారం)**

స్వాతంత్ర్య ఉద్యమ నాయ కుడు, జాతీయ ఉద్యమంలో ప్రథమంగా అరెస్ట యిన మహోన్నత వ్యక్తి, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం తొలి రాజీనామా చేసిన కేబినెట్ మంత్రి, నిజాంపై పోరాటం చేసిన వ్యక్తి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీని జాతిపితగా ప్రభుత్వం గుర్తించాలని కొండా లక్ష్మణ్ బాపూజీ ఫెడరేషన్ వ్యవస్థాపక చైర్మన్ జ్ఞానేశ్వర్ కోరారు. జూన్ 2వ తేదీన కొండా లక్ష్మణ్ బాపూజీనీ తెలంగాణ జాతిపితగా గౌరవించాలన్నారు. ఈ సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల అంజనేయులు, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్, సంఘం సభ్యులు, మహిళా సంఘం నాయకులు పాల్గొన్నారు.

## గోవధ కేంద్రాలను మూసివేయాలని వినతి

**జన్నారం, మే 27 (ప్రభాత సమాచారం)**

గోవధ కేంద్రాలను మూసి వేయాలని తహసీల్దార్ రాజమనోహార్ రెడ్డికి విశ్వహిందు పరిషత్, బజరంగ్ దళ్, హిందు వాహిని నాయకులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. హిందువులు గోవును ఆరాధ్యదై వంగా పూజిస్తుంటారు. అలాంటి గోవును మండలంలో పొన్కల్, గాంధీనగర్, జన్నారం లోని రాంనగర్, జన్నారం ఎన్‌టిఆర్ నగర్ దగ్గర పెద్ద మసీద్ పరిసరాల్లో, జన్నారం ప్రభుత్వ దవాఖాన దగ్గర, కవ్వాల్ గ్రామాల్లో గోవులను ఎటువంటి అనుమతి లేకుండా వధిస్తున్నారన్నారు.

## ఎయిర్‌గన్ శిక్షణకు సహకరిస్తా

**కాగజ్‌నగర్, మే 27 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ ఎయిర్‌గన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భువనేశ్వరి మంగళవారం ఎమ్మెల్యే హరీష్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఎయిర్‌గన్ శిక్షణ అందించేందుకు అసోసియేషన్ సిద్ధంగా ఉందని తెలిపారు. విద్యార్థుల్లో క్రీడాపట్ల ఆసక్తి పెంచే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయడానికి సహకరిస్తామని హామీ ఇచ్చారు.

# సాయంత్రం 6 తర్వాత ఇవి అస్సలు తినొద్దు



బొాన పొట్ట భయం మిమ్మల్ని వెంటాడుతోందా..నోరు కట్టేసుకున్నా, గంటల తరబడి కసరత్తులు చేసినా పొట్ట కరగడం లేదా? అయితే, దానికి కారణం రాత్రిపూట మీ తిండి అలవాట్లేనని న్యూట్రీషనిస్టులు చెబుతున్నారు. పొట్ట రాకుండా ఉండాలన్నా.. వచ్చిన పొట్టను కరిగించుకోవాలన్నా సాయంత్రం ఆరు దాటాక ఈ ఆరు ఆహార పదార్థాల వైపు చూడొద్దని సూచిస్తున్నారు. తీపి పదార్థాలు, కూల్ డ్రింక్స్, హై ప్రొటీన్ పదార్థాలు, పాల ఉత్పత్తులు, రిఫైన్డ్ కార్బొహైడ్రేట్లు, డీప్ ఫ్రై చేసిన ఆహార పదార్థాలు పగటి పూట తినడం మంచిదని, రాత్రిళ్లు వాటి జోలికి వెళ్లొద్దని సలహా ఇస్తున్నారు. దీనివల్ల మీ పొట్ట ఫ్లాట్ గా మారుతుందని వివరించారు.

**షుగరీ ఫుడ్స్ :** కేకులు, బిస్కెట్లు, చాక్ లెట్లలో క్యాలరీలు చాలా ఎక్కువ మోతాదులో ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. రాత్రిపూట వీటిని తినడం వల్ల కొవ్వు పేరుకుపోయి పొట్ట వస్తుందని హెచ్చరిస్తున్నారు. అధిక బరువుకూ ఇదే కారణమవుతుందన్నారు.

**హెవీ ప్రొటీన్స్ :** ప్రొటీన్లు ఆరోగ్యకరమనే విషయం అందరికీ తెలిసిందే. కానీ రాత్రిపూట హై ప్రొటీన్ ఉండే మటన్ వంటి ఆహార పదార్థాలను తీసుకుంటే జీర్ణం కావడం కష్టమని నిపుణులు చెప్పారు. దీనివల్ల నిద్రకు దూరమయ్యే పరిస్థితి కూడా ఎదురవుతుందన్నారు. రాత్రిపూట మాంసాహారం తినదల్చు కుంటే చికెన్, గుడ్లు తీసుకోవడం కొంత మేలని వివరించారు.

**కార్బొనేటెడ్ డ్రింక్స్ :** కూల్ డ్రింక్స్, సోడా, బీర్ వంటి కార్బొనేటెడ్ డ్రింక్స్ వల్ల పొట్టలో గ్యాస్ తయారవుతుందని నిపుణులు హెచ్చరించారు. దీంతో పొట్ట పెరగడం ఖాయమని చెప్పారు. ముఖ్యంగా రాత్రిపూట ఈ పానీయాలను దూరం పెట్టడం ఉత్తమమని సూచిస్తున్నారు.

**డెయిరీ ఉత్పత్తులు :** రాత్రి పూట పాలు తాగడం, వెన్న, యోగర్ట్, పాలతో తయారుచేసిన క్రీములను తీసుకోవడం వల్ల జీర్ణ సంబంధింత సమస్యలు ఎదురవుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పొట్ట పెరగడానికి కారణమవుతాయని చెప్పారు. సాయంత్రం ఆరు తర్వాత వీటిని తీసుకోవద్దని సూచిస్తున్నారు.

**రిఫైన్డ్ కార్బొహైడ్రేట్లు :** అన్నం, పాస్తా, బ్రెడ్ వంటి పదార్థాలంటే ఎంతగా ఇష్టం ఉన్నప్పటికీ రాత్రిపూట వాటిని తీసుకోవద్దని నిపుణులు చెప్పారు. ఈ పదార్థాల వల్ల ఇన్సులిన్ స్థాయిలు పెరిగి పొట్ట వస్తుందని హెచ్చరించారు.

**డీప్ ఫ్రైడ్ ఫుడ్స్ :** పకోడీలు, కచోరీ, సమోసాలతో పాటు వేపుళ్లకు డిన్నర్ లో చోటివ్వకుండా జాగ్రత్త పడితే మీ పొట్ట ఫ్లాట్ గా ఉంచుకోవచ్చని నిపుణులు తెలిపారు. నూనెలో బాగా వేయించిన పదార్థాలలో క్యాలరీలు చాలా ఎక్కువ మోతాదులో ఉంటాయని, ఇవి మీ జీర్ణక్రియను మందగించేలా చేస్తాయని వివరించారు. ఫలితంగా పొట్టలో కొవ్వు పేరుకుపోతుందని, తరచూ రాత్రిపూట వీటిని తీసుకుంటే పొట్ట రావడం ఖాయమని హెచ్చరించారు.



# సబ్జా గింజలతో ఫుల్ ఆరోగ్యం..



మనకు ఆరోగ్య ప్రయోజనాలను ఇచ్చే వాటిలో సబ్జా గింజలు ఒకటి. ఇక ఈ వేసవిలో సబ్జా గింజలు చేసే మేలు అంతా ఇంతా కాదు. వేసవి తాపానికి తల్లడిల్లుతున్న ప్రతిఒక్కరికి సబ్జా గింజలతో బోలెడన్ని ప్రయోజనాలు కలుగుతాయి. అధిక వేడితో ఇబ్బంది పడేవారు రోజుకు మూడు సార్లు నానబెట్టిన సబ్జా గింజల నీళ్ళు తాగడం వలన వేడి నుండి మీ శరీరం చల్లబడి మంచి ఉపశమనం పొందుతారు.



**అధిక బరువును తగ్గించడానికి సబ్జా గింజలు**

అధిక బరువుతో సతమతం అయ్యేవారు అనేక ఆనారోగ్య సమస్యలకు లోనవుతుంటారు. వారు సబ్జా గింజల నీళ్లను తాగడం వలన మంచి ప్రయోజనం ఉంటుంది. కేలరీలు తక్కువగా కలిగిన సబ్జా గింజలలో ,ఫైబర్ ఎక్కువగా ఉంటుంది, ఇది ఆకలిని తగ్గిస్తుంది, ఒంట్లో పేరుకుపోయిన చెడు కొలెస్ట్రాల్ని తగ్గిస్తుంది. అధిక బరువు సమస్య సబ్జా గింజలను తీసుకుంటే పరిష్కారం అవుతుంది.

**గుండె సంబంధిత వ్యాధులను నయం చేస్తుంది**

గుండె సంబంధిత వ్యాధులున్న వారికి ఈ సబ్జా గింజలను నానబెట్టి తాగడం వలన గుండె జబ్బుల నుండి విముక్తి పొందుతారు. ఎందుకంటే సబ్జా గింజలలో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ అధికంగా ఉంటాయి ఇవి గుండె పనితీరును మెరుగుపరుస్తాయి.బీపీ తగ్గిస్తాయి. రక్త ప్రసరణకు దోహదపడతాయి. ఆర్థరైటిస్ సమస్యలు, శ్వాసకోశ సమస్యలు రాకుండా ఉంటాయి.

**చర్మ సంబంధిత వ్యాధులకు సబ్జా గింజలు**

చర్మం పొడిబారకుండా మృదువుగా ఉండేందుకు సబ్జా గింజలు తోడ్పాడుతాయి , చర్మం పై నల్ల మచ్చలు ,మొటిమలు,గజ్జి , తామర వంటి చర్మ సంబంధిత వ్యాధులున్న వారికి సబ్జా గింజల నీళ్ళు తాగడం వలన త్వరితగతిన మార్పు వస్తుంది అని ఆయుర్వేద నిపుణులు చెప్తున్నారు. అరికాళ్ళు పగుళ్ళు ,లేదా అరికాళ్ళలో మంటలు కలిగే వారికి కూడా పగుళ్లను ,మంటలను నియంత్రించడంలో సబ్జా గింజలు పనిచేస్తాయి.

**సబ్జా గింజలను ఈ పద్ధతులో తగిన మోతాదులో తీసుకోండి :**

శరీరంలో సమస్యలు ఉన్నాయి అని ఎలా బడితే అలా సబ్జా గింజలను ఉపయోగించటం మంచిది కాదు.సబ్జా గింజలను తీసుకోవాలనుకుంటే మినిమం ఒక ఎనిమిది గంటలకు ముందుగా సబ్జా గింజలను నీళ్లలో నానబెట్టి బాగా నాని ఉబ్బిన సబ్జా గింజలను ఒక గ్లాసు నీళ్లలో గాని లేదా చల్లారిన పాలల్లో గాని లేదా నిమ్మకాయ రసంతో కానీ కలిపి తాగితే మంచి ఫలితాలు ఉంటాయి.

# తీర్థయాత్రలకు ప్రత్యేక రైళ్లు

**ఆదిలాబాద్, మే 27 (ప్రభాత సమాచారం)**

తీర్థయాత్రలకు వెళ్లే వారి కోసం రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం జూన్ 14వ తేదీ నుంచి జూలై 13వ తేదీ వరకు హైదరాబాద్ కేంద్రంగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ఐఆర్టీసీ టూరిజం జాయింట్ జనరల్ మేనేజర్ డీఎసీపీ కిషోర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలో ప్యాకేజీలకు సంబంధించిన వివరాలు..

**ప్యాకేజీ 1: (గంగా రామాయణ పుణ్య క్షేత్రయాత్ర- ఇఆ ఎ44)**

ఇందులో (కాశీ) వారణాసి/ అయోధ్య/ నైమిశారణ్య/ ప్రయాగరాజ్/ శృంగవర్పూర్ ప్రాంతాలు దర్శించవచ్చు. ఈ యాత్ర జూన్ 14 వ తేదీన ప్రారంభమై 22వ తేదీ వరకు ఉంటుంది. దీనికి ఒక్కొక్కరికి సాధారణ టికెట్టు ధర రూ.16,200, థర్డ్ ఏసీ ధర రూ.26,500, సెకండ్ ఏసీ ధర రూ.35,000 ఉంటుంది. ఈ తీర్థయాత్రలో ట్రైన్ సికి ంద్రాబాద్, భువనగిరి, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాద్, డోర్నకల్, ఖమ్మం, మ2 దిర, విజయవాడ, ఏలూరు రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం, పలాస, బరంపూర్, భువనేశ్వర్ మీదుగా వెళ్తుంది. .

**ప్యాకేజీ 2: (ఐదు జ్యోతిర్లింగ క్షేత్రాల యాత్ర - ఇఆ ఎ43)**

ఉజ్జయిని (మహాకాళేశ్వర్-ఓంకారేశ్వర్- త్రయంబకేశ్వర్-భీమశంకర్-ఘృష్టేశ్వర్) ఈ యాత్రలో మహాకాళేశ్వర్ / ఓంకారేశ్వర్ / త్రయంబకేశ్వర్/ భీంశంకర్/ఘృష్టేశ్వర్/ ఎల్లోరా/మోవ్/ నాగ్పూర్ ప్రాంతాలు సందర్శించవచ్చు. ఇది జూలై 05వ తేదీన ప్రారంభమై 13వ తేదీ వరకు ఉంటుంది. దీనికి ఒక్కొక్కరికి సాధారణ టికెట్ ధరరూ.14700గా ఉండగా, థర్డ్ ఏసీ ధర రూ.22,900, సెకండ్ ఏసీధర రూ.29,900 ఉంటుంది.యాత్ర సికింద్రాబాద్, కామారెడ్డి, నిజామాబాద్,ధర్మాబాద్,నాందేడ్, ముథ్కేడ్, మీదుగా సాగుతుంది.

**సౌకర్యాలు:** రైలు, బస్సు, హోటల్, అన్ని భోజనాలు (ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం), వాటర్ బాటిల్, టూర్ ఎస్కాట్ సేవలతో సందర్శన స్థలాలు, (అదనపు ఖర్చు లేదు), ప్రయాణ బీమా, ఇన్సూరెన్స్ అలాగే రైల్వే స్టేషన్ నుంచి దేవాలయాల వరకు ప్రయాణం పూర్తిగా ఉచితం. ప్రతి రైలులో 718 మంది ప్రయాణికులు ఉంటారు. ప్రతి 70 మందికి ఇద్దరు కోర్డినేటర్లు అందుబాటులో ఉండి అన్ని సౌకర్యాలు సమకూరుస్తారు. కోచికి ఒక సెక్యూరిటీ గార్డ్ అలాగే రైలులో సీసీ కెమెరాలతో కూడిన భద్రత ఉంటుందన్నారు. టికెట్ బుకింగ్ వివరాలకు 9701360701, 92810 30712, 9281495845, 92810 30749, 92810 30750 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు. మరిన్ని వివరాలకు www.irctc tourirm.com వైబ్సైట్ను సంప్రదించాలన్నారు.



## తుర్కం చెరువును సందర్శించిన ట్రైనీ అటవీ అధికారులు

**మామడ, మే 27 (ప్రభాత సమాచారం)**

మండలంలోని ఎకో టూరిజం సందర్శన కేంద్రం అయిన తుర్కం చెరువును ట్రైనీ అటవీ అధికారులు శిక్షణలో భాగంగా మంగళవారం సందర్శించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన 42 మంది ట్రైనీ బీట్ అధికారులు తుర్కం చెరువుతోపాటు యెంగన్న చెరువు వద్ద వలస పక్షులను ప్రత్యేక కెమెరాలతో వీక్షించారు. చెరువులకు వస్తున్న పక్షుల రకాల గురించి స్థానిక అధికారులను అడిగి తెలుసు కున్నారు. అడవిలో పెరుగుతున్న మొక్కల రకాలను తెలుసుకున్నారు. వారి వెంట ఎస్ఆర్వోలు శ్రీనివాస్ రావు, స్వరూప, ఎఫ్ఎస్వో శ్రీనివాస్, పీడీ కొండల్రావు, సిబ్బంది ఉన్నారు.



# నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



## ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు

కాగజ్‌నగర్, మే 27 (ప్రభాత సమాచారం)

అసెంబ్లీలో ప్రజల సమస్యలు లేవనెత్తి, సిర్పూర్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే హరీష్ బాబు అన్నారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెండు రోజుల క్రితం చింతలమానేపల్లి మండలం డబ్బా గ్రామంలో తనపై మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప వ్యాఖ్యలు చేశారని అన్నారు. పదేళ్ల పాటు 10 నుంచి 20 కిలోల ధాన్యం కటింగ్ చేయించి అక్రమంగా సంపాదించారని, సిర్పూర్ పేపరు మిల్లును వాడుకుని కార్మికులను నట్టేట ముంచారని, గుర్తింపు సంఘం ఎన్నికల గురించి ఆలోచించలేదని ఆరోపించారు. కొండపల్లిలో రెండు వేల ఎకరాలు, డబ్బా గ్రామంలో రెండు వేల ఎకరాల చొప్పున వేల ఎకరాల్లో ఫారెస్టు అధికారులు మొక్కలు నాటారని, దీనికి బాధ్యత ఆనాడు అధికారంలో ఉన్న కోనేరు కోనప్పది కాదా అని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టు నిర్మిస్తామని స్పష్టం చేశారు. కోనప్ప అసలు ఏ పార్టీలో ఉన్నాడో... ఏ పార్టీలోకి వెళ్లాలో తేల్చుకోలేని పరిస్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. రోజుకో మాట మాట్లాడుతున్నారని, అర్థంలేని ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. అభివృద్ధిని సహించలేక ఆయన అసహనానికి గురవుతున్నారని అన్నారు. సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు శివ, జిల్లా కోశాధికారి అరుణ్‌లోయ, అసెంబ్లీ కన్వీ నర్ గొల్లపల్లి వీరభద్రచారి, మాజీ జెడ్పీటీసీ నీరటి సత్యనారాయణ, మాజీ ఎంపీపీ మనోహర్ గౌడ్, తిరుపతి, కుమారస్వామి, తిరుపతి, సదానందం పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి తక్షణ సాయం అందజేత

ఉట్నూర్, మే 27 (ప్రభాత సమాచారం)

అడవి పంది దాడిలో మృతి చెందిన కొడప లక్ష్మణ్ కుటుంబానికి అటవీ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం తక్షణ సహాయం కింద రూ.10వేలు అందజేశారు. ఉట్నూర్ ఎఫ్‌డీఓ రేవంత్ చంద్ర, ఫారెస్ట్ సిబ్బందితో కలసి మండలంలోని రాజులగూడ గ్రామంలోని మృతి ని కుటుంబాన్ని పరామర్శించారు.అటవీ శాఖ తరపున వైల్డ్ లైఫ్ కాంపో న్సేషన్ ప్రక్రియను పూర్తి చేసి ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తామని పేర్కొన్నారు.

## జర్నలిస్టు మునీర్‌కు నివాళి

మందమర్రి, మే 27 (ప్రభాత సమాచారం)

మంచిర్యాల జిల్లా సీనియర్ జర్నలిస్ట్ ఎం.డి మునీర్ మృతికి సంతాపంగా జర్నలిస్టులు మందమర్రి మార్కెట్‌లోని పుర వీధుల గుండా అంబేద్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

## ఉద్యోగం ఇప్పిస్తానని మోసగించిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్, మే 27 (ప్రభాత సమాచారం)

పట్టణంలోని ఖానాపూర్‌కు చెందిన జావిద్ ఖాన్‌పై మంగళవారం కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. పట్టణానికి చెందిన అబ్దుల్ అజీజ్ ఇద్దరు కుమారులకు కాంట్రాక్ట్ పద్ధతిలో తహసీల్దార్ కార్యాలయంలో, సిటీ యూనియన్ బ్యాంక్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. వారి వద్ద నుంచి రూ.2లక్షల చొప్పున రూ.4 లక్షలు తీసుకున్నాడు. డబ్బులు అడిగితే చంపుతానని బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు వివరించారు.

## పెర్సపేన్ ఆలయంపై పిడుగు

ఇంద్రవెల్లి, మే 27 (ప్రభాత సమాచారం)

మండల కేంద్రంలో మంగళవారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షా నికి పొల్లుగూడలో జుగ్నాక్ వంశీయులధ్వంసమైన ఆలయ గోపురం కులదైవమైన ఆలయంపై పిడుగు పడింది. దీంతో ఆలయ గోపురం ధ్వంసం కావడమే కాకుండా కలశం ఊడిపోయింది.

# అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

ఆసిఫాబాద్, మే 27 (ప్రభాత సమాచారం)

ప్రజల సంక్షేమం కోసం అధికా రులు చిత్తశుద్ధితో పని చేయాలని, కలెక్టర్లు అధికారు లతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనుల పురోగ తిని పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో ధాన్యం కొనుగోళ్లు, వ్యవసాయం, భూ భారతి చట్టం, ఇందిరమ్మ ఇళ్లు, ఇతర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సీఎం మాట్లాడుతూ గతంతో పోల్చితే ఈ ఏడాది వరి ధాన్యం సేకరణ అధికంగా జరిగిందన్నారు. భూభారతి చట్టంలో భాగంగా నాలుగు జిల్లాల్లో నాలుగు మండలాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామని తెలిపారు. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించి



అందించాలన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటేశ్ దోత్రే వీడియోకాన్ఫరెన్సుకు హాజరయ్యారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు, భూ భారతి చట్టం అమలు, ఇంది రమ్మ ఇళ్ల పథకాలను లక్ష్యాలు సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఆర్డీవో లోకేశ్వర్ రావు, డీపీవో భిక్షప తిగౌడ్, డీఆర్డీవో దత్తారావు, గృహనిర్మాణ శాఖ పీడీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# విధుల్లో అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ అఖిల్ మహాజన్





తలమడుగు, మే 27 (ప్రభాత సమాచారం)

మహారాష్ట్ర సరిహద్దు మండలాల్లో అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌తో పాటు మండలంలోని లక్ష్మీపూర్ చెక్‌పోస్టును మంగళవారం తనిఖీ చేశారు. బక్రీద్ సందర్భంగా జిల్లాలోకి పశువుల అక్రమ రవాణా కాకుండా వివిధ శాఖల సమన్వయంతో చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వర్తించాలన్నారు. స్టేషన్‌లో కేసులు పెండింగ్ లేకుండా చొరవ చూపాలన్నారు. బక్రీద్ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 8 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బక్రీద్ సందర్భంగా జిల్లాలోకి అక్రమంగా అనుమతులు లేకుండా ఎలాంటి పశువుల రవాణా జరగకుండా వివిధ శాఖల సమన్వయంతో చెక్ పోస్ట్‌లను 24 గంటలు అప్రమత్తంగా ఉంటూ విధులను నిర్వర్తించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిశీలన తదుపరి కోసాయి రైల్వే స్టేషన్‌కు వెళ్లి రైలు రాకపోకలపై, అక్రమ రవాణా పై ఆరా తీసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అదేవిధంగా సిబ్బందితో మాట్లాడుతూ సిబ్బంది ప్రతిరోజు నిర్వర్తిస్తున్న విధులను పరిశీలించారు. ప్రతి ఒక్క సిబ్బందికి గ్రామాలను కేటాయించి విలేజ్ పోలీస్ ఆఫీసర్ వ్యవస్థను మరింత పటిష్టంగా నిర్వహించాలన్నారు. గ్రామాలలో జరుగుతున్న ప్రతి ఒక్క సమాచారం తెలుసుకునే విధంగా సమాచార వ్యవస్థను పెంపొందించుకోవాలన్నారు. అనంతరం కోసాయి రైల్వేస్టేషన్‌కు చేరుకుని అక్రమ రవాణాపై ఆరా తీసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎస్సై రాధిక, ఏఎస్సై లక్ష్మణ్, సిబ్బంది ఉన్నారు.

## భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు పదేళ్ల జైలు శిక్ష

ఆదిలాబాద్, మే 27 (ప్రభాత సమాచారం)

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు 10సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, పదివేలు జరిమానా విధిస్తూ జిల్లా అసిస్టెంట్ సెషన్స్ జడ్జీ సిఎం రాజ్యలక్ష్మి మంగళవారం తీర్పును వెలువరించారు. బేల మండలం సిర్సన్న గ్రామానికి చెందిన దందేపల్లి నరసయ్య భార్య భూమికను మానసికంగా వేధించడం, హింసించడం చేసేవాడు. భర్త పెట్టే చిత్ర హింసలు భరించలేక ఆమె 2019 అక్టోబర్ 18న కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టు డ్యూటీ అధికారి జమీర్ సహకారంతో సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పీపీ షాహిన్ సాక్షులను విచారించారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్షను ఖరారు చేశారు.

## పురుగుల మందు తాగి కూలీ మృతి

తాంసి, మే 27 (ప్రభాత సమాచారం)



ఓ వ్యవసాయ కూలీ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కప్పర్ల గ్రామానికి చెందిన అనుప నారాయణ(31) వ్యవసాయ కూలీగా పని చేస్తున్నాడు. కాగా, మంగళవారం తన యజమాని పంట చేనుకు పని కోసం వెళ్లి పురుగుల మందు తాగారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు తాంసి ఎస్‌హెచ్‌వో భాస్కర్ తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కాగా, మృతునికి భార్య,కూతురు ఉన్నారు. నారాయణమృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## యూట్యూబర్‌పై చర్యలు తీసుకోవాలి

ఖానాపూర్, మే 27 (ప్రభాత సమాచారం)

యూట్యూబర్ ప్రవీణ్‌పై చర్యలు తీసుకోవాలని ఖానాపూర్ ఏఐఎంఐఎం నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు అఖిల్, ప్రధాన కార్యదర్శి అఫ్సర్‌లు ఈ సందర్భంగా మాట్లాడుతూ యూట్యూబర్ ప్రవీణ్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడి తమను మనోవేదనకు గురి చేశాడని చెప్పారు. అతనిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఆందోళనలు చేపడతామన్నారు. ఇందులో నాయకులు షారుక్, కైఫ్‌లు ఉన్నారు.



## వివాహం కావడంలేదని యువకుడు ఆత్మహత్య

సోన్, మే 27 (ప్రభాత సమాచారం)

వివాహం కావడంలేదని మనస్తాపంతో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రానికి చెందిన గోలి సుదర్శన్ (31) ఆరునెలల క్రితం విదేశాల నుంచి తిరిగి వచ్చాడు. తనకు వివాహం కావడంలేదని మనస్తాపంతో మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం ఉదయం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకు న్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై కె.గోపి తెలిపారు.



## నేటి వరకే జొన్నల కొనుగోలు

కుభీర్, మే 27 (ప్రభాత సమాచారం)

కుభీర్ మార్కెట్ యార్డులో జొన్నల కొనుగోలు ఈ నెల 28వ తేదీతో ముగియనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్, మార్క్ ఫెడ్ స్టేట్ డైరెక్టర్ రేకుల గంగాచరణ్, సీఈవో క్రాంతి కుమార్ ఒక ప్రకట నలో తెలిపారు.ఏ తేదీ వరకూ టోకెన్స్ పొందినా బుధవారం చివరి రోజు అని తెలిపారు. 29 నుంచి టోకన్లు పొందిన రైతులు ఈ చివరి అవకాశాన్ని వినియోగపరుచుకోవాలని కోరారు.



# ఆదివాసీలు ఐక్యంగా ఐక్యంగా ఉండాలి



- అక్షరాస్యతతోనే సమాజంలో గుర్తింపు
- కొమురం భీం స్ఫూర్తితో ముందుకెళ్లాలి
- ఉమ్మడి జిల్లా ఇంచార్జీ మంత్రి సీతక్క

**ముథోల్ (లోకేశ్వరం), మే 27 (ప్రభాత సమాచారం)**

ఆదివాసీలు ఐక్యంగా ఉండి అభివృద్ధి చెందాలని జిల్లా ఇంచార్జీ మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం లోకేశ్వరం మండల కేంద్రంలో ఆదివాసి నాయక్ పోడ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొమురం భీం విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జల్-జంగల్-జమీన్ నినాదంతో ఆంగ్లేయులతో పోరాటం చేసిన పోరాటయోధుని విగ్రహాన్ని తన చేతుల మీదుగా ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఆయన పోరాట స్ఫూర్తితో ఆదివాసీలు ముందుకెళ్లాలని అన్నారు. హక్కుల సాధన కోసం పోరాటం చేసిన యోధులను భావితరాలు గుర్తుంచుకునేలా ఇలాంటి విగ్రహాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అన్ని వర్గాలవారికి అక్షరాస్యతతోనే సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుందని ఆదివాసీ బిడ్డలు అక్షరాస్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

**త్వరలో పోటు భూముల సమస్యకు పరిష్కారం...**

ఆదివాసీలు, గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూముల సమస్యలకు ముఖ్యమంత్రి త్వరలో పరిష్కారం చూపనున్నారని అన్నారు. బడుగు బలహీనవర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

**దశలవారీగా సమస్యల పరిష్కారం..**

మండలంలోని సమస్యలను స్థానిక ఎమ్మెల్యేతో పాటు నాయకులు మంత్రి దృష్టికి తీసుకురాగా దశలవారీగా ప్రాధాన్యత క్రమంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. లోకేశ్వరం మండల కేంద్రంలో మహిళ డిగ్రీ కళాశాల ఏర్పాటుతో పాటు సుద్ధ వాగుపై బ్రిడ్జి, రెండు వరుసల రహదారి నిర్మాణం పనుల కోసం నిధులు మంజూరు చేయించాలని ఎమ్మెల్యే రామారావు పటేల్ మంత్రి దృష్టికి తీసుకు రాగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అలాగే మండల కేంద్రాలతో పాటు జిల్లా కేంద్రంలో ఆదివాసి భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని స్థానిక ఆదివాసీ నాయకులు కోరగా వీలైనంత త్వరలో నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముధోల్ ఖానాపూర్ ఎమ్మెల్యేలు పవార్ రామారావు పటేల్, వెడమ బొజ్జు పటేల్, మాజీ ఎంపీ సోయం బాపూరావు, మాజీ ఎమ్మెల్యేలు నారాయణ రావు పటేల్, విట్టల్ రెడ్డి, నాయకులు ఆత్రం సుగుణ, రాజేష్ బాబు, సంఘం నరసయ్య, గంజాల గంగాధర్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



# నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

## సేంద్రియ సాగుపై దృష్టి సారించాలి - ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

**ఇంద్రవెల్లి, మే 27 (ప్రభాత సమాచారం)**

మార్కెట్‌లో నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని, శాస్త్రవేతల సలహాలతో పంటలు సాగు చేయాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హెచ్చరించారు. మంగళవారం ఇంద్రవెల్లి మండలంలోని ముత్నూర్ గ్రామంలోని రైతు వేదిక భవనంలో రైతు ముంగిట్లో శాస్త్రవేతలు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ వ్యవసాయ సాగుపై దృష్టి సారించాలని అన్నారు. రసాయన ఎరువుల వాడకం వల్ల భూకాలుష్యం పెరిగి, మానవ మనుగడకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. పురాతన కాలంలో పండించిన పంటలను మళ్లీ సాగు చేయాలని సూచించారు. ఖానాపూర్ నియోజకవర్గంలో నకిలీ విత్తనాలు, ఎరువులు సరఫరా కాకుండా అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని అన్నారు. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ శాస్త్రవేతలు, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# వర్షంలో రాత్రి తడిసిన దాన్యాన్ని పరిశీలించిన కలెక్టర్

**రాత్రి పూట కడ్తాల్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

**సోన్, మే 27 (ప్రభాత సమాచారం)**

సోన్ మండలంలోని కడ్తాల్ గ్రామంలో గల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ, ధాన్యపు సంచుల లోడింగ్, లారీల తరలింపు ప్రక్రియ సజావుగా జరుగుతుందో లేదో పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ, ప్రత్యేక సంబంధించిన వివరాలను వారిని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో దాదాపుగా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ చివరి దశకు చేరుకుందని, ముందస్తు వర్షాల వల్ల వరి ధాన్యం అమ్మకంలో రైతులకు ఇబ్బందులు కలుగుతుందన్నారు. వరి ధాన్యం కొలుగోలుపై రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని వారికి ధైర్యం చెప్పారు. అకాల వర్షాలతో కొనుగోలులో ఇబ్బందులు తలెత్తాయని, అయినప్పటికీ సీఎం ఆదేశాల మేరకు అధికారులంతా నిరంతరం వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారని అన్నారు. ఈ తనిఖీలో అద నపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కుమార్, ఆర్డిఓ రత్న కళ్యాణి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.







# సమీకృత గురుకులం

# విద్యాభివృద్ధికి సోపానం

- ఖానాపూర్ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్
- రూ.200కోట్లతో స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణం
- 20 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పాఠశాలలకుఓకే చెప్పిన సర్కార్
- రూ.4,000 కోట్లతో ప్రతిపాదనలకు పరిపాలన మంజూరి జారీ
- ఒక్కో పాఠశాల కాంప్లెక్స్‌కు 200కోట్ల చొప్పున కేటాయింపు

**(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)**

ఖానాపూర్ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరైంది. రూ.200 కోట్లతో దీన్ని నిర్మించనున్నారు. ఖానాపూర్ అసెంబ్లీలోని యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేయాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చేసిన ప్రయత్నం మేరకు సీఎం రేవంత్ రెడ్డి ఖానాపూర్‌కు పాఠశాలను మంజూరు చేశారు. పాఠశాల విద్య, మౌలిక సదుపాయాలను పెంపొందించడానికి తెలంగాణ ప్రభుత్వం 20 అసెంబ్లీ నియోజకవర్గాలలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్‌లను నిర్మించడానికి రూ.4,000 కోట్లతో ప్రతిపాదనలకు పరిపాలన మంజూరి జారీ చేసింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్‌లను నిర్మించడానికి ఒకొక్క దానికి రూ. 200 కోట్లు కేటాయించారు. తెలంగాణ విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకుని పాఠశాల విద్య (శిక్షణ) విభాగం ఈ పరిపాలనా మంజూరిని జారీ చేసింది.నాణ్యమైన విద్యను, ముఖ్యంగా వెనుకబడిన,గిరిజన ప్రాంతాలలో ప్రపంచ స్థాయి రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటుకు ఈ నిధులను వినియోగిస్తారు. సకాలంలో అమలు జరిగేలా చూసుకోవడానికి ఈ కార్యక్రమాన్ని నిర్దేశించిన విధంగా అమలు చేయాలని ప్రభుత్వం టీజీవిడీసీకి సూచించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆలేరు, అశ్వారావుపేట (ఎస్టీ), బాన్సువాడ, భద్రాచలం (ఎస్టీ), భువనగిరి, దేవరకొండ (ఎస్టీ), ఇబ్రహీంపట్నం, ఖానాపూర్ (ఎస్టీ), మహబూబాబాద్ (ఎస్టీ), మిర్యాలగూడ, పాలకుర్తి, పరిగి, పటాన్చెరు, మహబూబ్ నగర్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, వేములవాడ, వర్ధణపేట (ఎస్సీ), వరంగల్ వెస్ట్, ఎల్లారెడ్డిలలో స్కూల్ కాంప్లెక్స్‌లను నిర్మించనున్నారు.



# నేడు,రేపు భారీ వర్షాలు

**ఆదిలాబాద్, మే 27 (ప్రభాత సమాచారం)**

వర్షాకాలం ముందే వచ్చేసింది. రాబోయే రెండు రోజుల్లో భారీ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. అలాగే పలు జిల్లాలకు అధికారులు ఆరెంజ్, ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు. నైరుతి రుతుపవనాలు దక్షిణ తెలంగాణలోకి విస్తరించాయి. ఉత్తర బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఈ కారణంగా నేడు, రేపు, ఎల్లుండి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ ప్రకటించింది. గంటకు 40-50 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయి. భారీ వర్షాల నేపథ్యంలో బుధవారం తెలంగాణలోని 4 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, 14 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. పలు జిల్లాల్లో బుధ, గురువారాల్లో 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీంతో రాబోవు రెండు, మూడు రోజులు గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 5 నుంచి 7 డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉంది. భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. చాలా ప్రాంతాల్లో పిడుగులు పడే అవకాశం ఉన్నందున పాత భవనాలు, చెట్ల కింద ఉండకూడదని హెచ్చరిస్తున్నారు. రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

విలేకరులు
కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY